జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్...
రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 5 సంచిక 213 | హైదరాబాద్, మే 25 బుధవారం 2022 | 8 పేజీలు | వెల : 5.00

# రాష్ట్రంలో మరో కంపెనీ భారీ పెట్టుబడి

- రైతుల మేలు కోసం తెలంగాణ
- సర్కారుతో కలిసి పనిచేస్తా..

## కేటీఆర్‌తో భేటీలో సద్గురు జగ్గీ వాసుదేవ్





హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. రాష్ట్రంలో మరో కంపెనీ భారీ పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపింది. తెలంగాణలో అలీఆక్సిస్ కంపెనీ రూ. 500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. గ్రీన్ ఫీల్డ్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆ కంపెనీ ప్రకటన చేసింది. దావోస్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో భేటీ అనంతరం అలీఆక్సిస్ కంపెనీ ప్రతినిధులు ఈ ప్రకటన చేశారు. ప్లాస్టిక్ పైపులు, యాక్సెసరీస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభిస్తే 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలీఆక్సిస్ కంపెనీ ఆశీర్వాద్ పైప్స్‌కు చెందిన కంపెనీ.

**రైతుల మేలు కోసం తెలంగాణ సర్కారుతో కలిసి పనిచేస్తా..**

తమ సంస్థ ద్వారా వ్యవసాయ రంగంలో రైతుల ఆదాయం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సద్గురు జగ్గీ వాసుదేవ్ పేర్కొన్నారు. సద్గురు జగ్గీ వాసుదేవ్ ప్రపంచవ్యాప్తంగా 'సేవ్ సాయిల్' పేరుతో అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. దావోస్‌లో ఆయన రెండు రోజులపాటు ప్రపంచస్థాయి కంపెనీలను కలిసి తన కార్యక్రమంలో (మిగతా 2లో..)

# తెలంగాణ బీజేపీ నుంచి రాజ్యసభకు ఒకరికి అవకాశం..



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర ప్రభుత్వం బంపరాఫర్ ప్రకటించింది. పార్టీ బలోపేతంపై హైకమాండ్ సీరియస్ ఫోకస్ పెట్టింది. తెలంగాణ నుంచి రాజ్యసభకు ఒకరికి అవకాశం లభించనుంది. ఉత్తరాది రాష్ట్రాల కోటా నుంచి ఎంపిక చేశారు. పరిశీలనలో మురళీధర్‌రావు, గరికపాటి మోహన్‌రావు, విజయశాంతి పేర్లున్నట్టు తెలుస్తోంది. నామినేషన్లకు తుది గడువు ఈ నెల 30 వరకూ ఉంది. ఈ ముగ్గురిలో అదృష్టం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటి వరకూ తెలంగాణలో బీజేపీ నుంచి నేరుగా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన వారెవరూ లేరు. ఒకవేళ ఈ ముగ్గురిలో ఎవరైనా ఎన్నికైతే వీరే ప్రథమం అవుతారు. తెలంగాణ బీజేపీ నుంచి రాజ్యసభకు ఒకరికి అవకాశం.. ఆ అదృష్టవంతులెవరో.. జూపల్లికి రాజ్యసభ.. మరోవైపు తెలంగాణలో ప్రముఖ పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వరరావుపై కమలనాథులు దృష్టి పెట్టారు. ఆయన్ను పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సమతామూర్తి ప్రారంభోత్సవం సమయంలో ఆయనకు, సీఎం కేసీఆర్‌కు మధ్య విభేదాలు వచ్చాయని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం జూపల్లికి, కేసీఆర్‌కు పొసగడం లేదని భావిస్తున్న బీజేపీ వర్గాలు ఆయనను తమ పార్టీలో చేర్చుకోవడం ఖాయమని చెబుతున్నాయి. ఆయన సేవలను పార్టీకి ఎలా వినియోగించుకోవాలన్న అంశంపై మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. రాజ్యసభకు నామినేట్ చేసే ప్రతిపాదన కూడా వచ్చిందని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే బీజేపీ ఆకర్ష్ ప్రయత్నాలకు రామేశ్వరరావు ఎటువంటి వైఖరి తీసుకుంటారనేది వేచి చూడాల్సిందే.

# బలప్రయోగాన్ని సహించం..

## చైనాకు క్వాడ్ తీవ్ర హెచ్చరిక.. ఉక్రెయిన్‌పై దాడిని ఖండించిన అగ్రనేతలు..



టోక్యో: ఇండో పసిఫిక్ ప్రాంతం స్వేచ్ఛను పరిరక్షించడానికి దృఢ చిత్తంతో వ్యవహరిస్తామని క్వాడ్ దేశాల అగ్రనేతలు ప్రతినబూనారు. జపాన్‌లోని టోక్యోలో క్వాడ్ శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం ముగింపు సందర్భంగా నాలుగు దేశాల అగ్ర నేతలు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఈ ప్రాంత దేశాలన్నిటినీ కలుపుకుంటూ ఈ ప్రాంత సుస్థిరతకు పాటుపడుతామని వారు ఆ ప్రకటనలో స్పష్టం చేశారు. బలవంతంగా యథాతథ స్థితిని మార్చడానికి ఎవరు ప్రయత్నించినా సహించబోమని కూడా ఈ ప్రకటనలో క్వాడ్ నేతలు హెచ్చరిక జారీ చేశారు. ఈ హెచ్చరికను చైనాను ఉద్దేశించినదేనని స్పష్టమవుతున్నది. అయితే సంయుక్త ప్రకటనలో ఎక్కడా చైనా పేరును ప్రస్తావించలేదు. అయినా%శా%ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా సాగిస్తున్న దుందుడుకు చర్యలను ఈ ప్రకటనలో సవివరంగా పేర్కొన్నారు.ఒక వైపు ఈ సమావేశాలు జరుగుతుండగానే రష్యా, చైనా యుద్ధవిమానాలు జపాన్ సమీపంలో విన్యాసాలు చేశాయని జపాన్ రక్షణ మంత్రి నోబూ కిషి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రష్యా, చైనా దేశాలకు తీవ్ర నిరసనను తెలియజేసినట్లు కూడా కిషి తెలియజేశారు. అయితే, రష్యా, చైనా విమానాలు జపాన్ గగనతలంలోకి ఏమీ జొరబడలేదని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. క్వాడ్ గ్రూప్‌లో మన దేశంతో సహ అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ సభ్యదేశాలుగా ఉన్నాయి. భాగస్వామ్య దేశాల మధ్య బంధం కాలంతో పాటు ఎలా పటిష్టమైందీ ఆ ప్రకటనలో వివరించారు. 20008లో క్వాడ్ గ్రూప్ తొలిసారి కార్యరూపం దాల్చినా..ఆ తరువాత సద్దుమణిగిందనీ, 2017లోనే దానిని పునరుద్ధరించడం జరిగిందనీ (మిగతా 2లో..)

# ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు




హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి :ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 26న హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ఐఎస్‌బి గ్రాడ్యుయేషన్ సెరిమెనీలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గచ్చిబౌలి స్టేడియం, ట్రిపుల్ ఐటీ జంక్షన్ నుంచి విప్రో జంక్షన్, ట్రిపుల్ ఐటీ నుంచి గచ్చిబౌలి మధ్య ఉన్న ఆఫీసుల్లో పనిచేసే వారు వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా ఆఫీస్ టైమింగ్స్ మార్చుకోవాలి.గచ్చిబౌలి జంక్షన్ నుంచి లింగంపల్లి వైపు వెళ్లేవారు గచ్చిబౌలి జంక్షన్ దగ్గర రైట్ టర్న్ తీసుకుని బొటానికల్ గార్డెన్, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, మజీద్ బండ, హెచ్ సీయూ డిపో ద్వారా లింగంపల్లికి వెళ్లాలి.

లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వచ్చే వారు హెచ్?సీయూ డిపో దగ్గర లెఫ్ట్ తీసుకుని మజీద్ బండ, కొండాపూర్ ఏరియా హాస్పిటల్, బొటానికల్ గార్డెన్ నుంచి గచ్చిబౌలి జంక్షన్?కి చేరుకోవాలి

విప్రో నుంచి లింగంపల్లికి వైపు వెళ్లే వారు విప్రో జంక్షన్ దగ్గర లెఫ్ట్ తీసుకుని క్యూ సిటీ, గౌలిదొడ్డి, గోపన్?పల్లి ఎక్స్ రోడ్, హెచ్?సీయూ బ్యాక్ గేట్, నల్లగండ్ల నుంచి లింగంపల్లి వైపు వెళ్లాలి

విప్రో నుంచి గచ్చిబౌలికి వెళ్లేవారు విప్రో జంక్షన్ దగ్గర రైట్ తీసుకుని ఫెయిర్ ఫీల్డ్ హోటల్, నానక్ రామ్ గూడ రోటరీ, ఓఆర్ఆర్, ఎల్ఆండ్ టీ టవర్స్ మీదుగా గచ్చిబౌలి జంక్షన్?కు చేరుకోవాలి

కేబుల్ బ్రిడ్జి నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వెళ్లే వారు కేబుల్ బ్రిడ్జ్?పైకి ఎక్కే ర్యాంప్ నుంచి రైట్ తీసుకొని రత్నదీప్, మాదాపూర్ పీఎస్, సైబర్ టవర్స్, హైటెక్స్, కొత్తగూడ, బొటానికల్ గార్డెన్ మీదుగా గచ్చిబౌలి జంక్షన్?కు వెళ్లాలని పోలీసులు సూచించారు.



# చివరి గింజ వరకు కొంటాం

కరీంనగర్,ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో ధాన్యం సేకరణ రెండు వారాల్లో పూర్తవుతుందని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ధాన్యం సేకరణ తీరుపై ఆయన మాట్లాడుతూ... జూన్ 10లోగా ధాన్యం సేకరణ మొత్తం పూర్తవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి ప్రకటించారు. అకాల వర్షాలకు తడిసిన దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా... ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తామని గంగుల స్పష్టం చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు చివరి గింజ వరకు కొంటామని, రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని సూచించారు.

# ఓయూ ప్రొఫెసర్లకు పదోన్నతులు..

## ఉత్తర్వులు జారీ చేసిన ఉస్మానియా వర్సిటీ




హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి: ప్రొఫెసర్లకు సీనియర్లుగా పదోన్నతులు కల్పిస్తూ తొలిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పదేళ్లకు పైగా ప్రొఫెసర్లుగా పనిచేసిన అనుభవంతో పాటు పరిశోధన అనుభవం ఆధారంగా ఈ పదోన్నతులకు ఎంపిక చేశారు. సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన 26 మంది సీనియర్ ప్రొఫెసర్ల జాబితాను ఓయూ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆమోదించింది. ఉస్మానియా వర్సిటీ ప్రకటించిన జాబితాలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొ.ఆర్.లింబాద్రి కూడా ఉన్నారు. సీనియర్లుగా పదోన్నతులు పొందిన 26 మంది ప్రొఫెసర్లు వర్సిటీ వీసీ ప్రొ.డి.రవీందర్ చేతుల మీదుగా మంగళవారం పదోన్నతి ఉత్తర్వులు అందుకున్నారు. అత్యధికంగా ఇంజనీరింగ్ కళాశాల నుంచి 8 మంది పదోన్నతులు పొందారు. ఆ తర్వాత బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్ విభాగం నుంచి నలుగురు చొప్పున, ఇంగ్లీష్ విభాగం నుంచి ఇద్దరు, ఎడ్యుకేషన్ నుంచి మరో ఇద్దరు పొందారు. తెలుగు నుంచి ఒకరు, వ్యాయామ విద్యా, ఫిజిక్స్, టెక్నాలజీ, జువాలజీ విభాగం నుంచి ఒకరు చొప్పున ఉన్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పదోన్నతి పొందారు.

# రేవంత్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం



హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి:కులాలపై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాను ఏకీభవించడం లేదని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్ మహేశ్వర్ రెడ్డి అన్నారు. రెడ్లకు, వెలమలకు ఎటువంటి విభేదాలు లేవన్న ఆయన.. చొక్కారావు, పీవీ నరసింహా రావు వంటి నేతలు కాంగ్రెస్ పార్టీ కోసం ఎంతో కృషి చేశారన్నారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమని మహేశ్వర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమన్న ఆయన.. కాంగ్రెస్ చరిత్ర తెలియని వాళ్లు ఏదో మాట్లాడితే వాటిని పార్టీ వ్యాఖ్యలుగా భావించొద్దని కోరారు.కాగా రెడ్డి కులానికి సంబంధించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ప్రతి రెడ్డికి 10ఎకరాలు ఉన్నప్పుడే రాజ్యం, రాజకీయం రెడ్ల చేతుల్లో ఉంటుందని రేవంత్ అన్నారు. రెడ్లను నమ్ముకున్న వాళ్లు ఎవరూ మోసపోలేదని.. పార్టీలు గెలవాలంటే రెడ్లకే పార్టీల పగ్గాలు అప్పజెప్పాలని వ్యాఖ్యానించారు. కాకతీయ సామ్రాజ్యం లో ప్రతాప రుద్రుడు వచ్చాక రెడ్డి సామంత రాజులను పక్కన పెట్టి వెలమలైన పద్మనాయకులను దగ్గరికి తీశాడని అందుకే కాకతీయ సామ్రాజ్యం కూలిపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెడ్లకు, వెలమలకు పొసగదన్న రేవంత్ కామెంట్స్ పై ఇప్పటికే పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# అక్రిడిటేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానించిన సమాచార మరియు పౌర సంబంధాల శాఖ...

హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ): 2022-24 సంవత్సరానికి అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం సమాచార పౌర సంబంధాల శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు సమాచార %ంౌ% పౌర సంబంధాల శాఖ అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ఉన్న అక్రిడిటేషన్ కార్డ్‌ల చెల్లుబాటు 30.06.2022తో ముగుస్తున్నందున, 2022-24 సంవత్సరాల్లో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డ్‌లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మరియు న్యూస్ ఏజెన్సీల యాజమాన్యాలు తమ సంస్థలకు చెందిన వర్కింగ్ జర్నలిస్ట్‌ల పేర్ల జాబితాను 04.06.2022లోపు సమాచార ప్రజాసంబంధాల విభాగానికి తప్పనిసరిగా సమర్పించవలసిందిగా తెలిపారు. స్వతంత్ర వర్గానికి చెందిన జర్నలిస్టులు నేరుగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కార్డుల పేర్లను కమీషనర్, సమాచార మరియు పౌరసంబంధాలు, హైదరాబాద్‌కు పంపాలని మరియు జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల పేర్లను జిల్లాల సంబంధిత డిపిఆర్వోలకు పంపవచ్చని అన్నారు. మేనేజ్‌మెంట్‌లు తమ పేర్లను పంపిన జర్నలిస్టులు 25.05.2022 నుండి 04.06.2022 వరకు డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ http://ipr.telangana.gov.in ని సందర్శించడం ద్వారా ఆన్‌లైన్ ద్వారా అక్రిడిటేషన్ కార్డ్‌ల కోసం తమ దరఖాస్తులను సమర్పించాలని ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

## రాష్ట్రంలో మరో కంపెనీ భారీ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇందులోభాగంగా అత్యంత కీలకమైన ప్రభుత్వాధినేతలు, కార్పొరేట్ కంపెనీలతో సమావేశమైన సద్గురు.. మంగళవారం మంత్రి కేటీఆర్‌తో దావోస్‌లోని తెలంగాణ పెవిలియన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా తాను చేపట్టిన 'సేవ్ సాయిల్' కార్యక్రమం గురించి సద్గురు మాట్లాడారు. రాబోయే మూడు దశాబ్దాల్లో ప్రపంచంలోని వ్యవసాయ యోగ్యమైన నేలలు అంతరించి పోయే ప్రమాదం ఉందని, ఇప్పటినుంచి భూమిని పంటలకు అనుగుణంగా సారవంతం చేసే కార్యక్రమాలను పెద్దఎత్తున చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకోసం లండన్ నుంచి కావేరి వరకు తాను నిర్వహిస్తున్న 'సేవ్ సాయిల్' ర్యాలీలో భాగంగా వివిధ ప్రభుత్వాధినేతలు, ప్రముఖ కంపెనీలను కలిసి ఈ కార్యక్రమం ప్రాధాన్యత, అవసరాన్ని వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భూమి సారాన్ని కోల్పోతున్నదని, త్వరలోనే ఈ సమస్య వల్ల ఆహార కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా సద్గురు తెలిపారు. పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు అన్ని ప్రభుత్వాలు అత్యంత వేగంగా శ్రీకారం చుట్టాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు పర్యావరణ అనుకూల కార్యక్రమాలను సద్గురుకు వివరించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మానవ ప్రయత్నమైన హరితహారం కార్యక్రమ వివరాలను తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేకమైన విప్లవాత్మకమైన మార్పులు, మద్దతు కార్యక్రమాలను తీసుకువచ్చి.. వ్యవసాయోత్పత్తుల పెంపునకు చేస్తున్న కృషిని వివరించారు.

## బలప్రయోగాన్ని సహించం..

(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రకటనలో వివరించారు. ఈ నాలుగు దేశాల అగ్రనేతలు తొలిసారిగా నిరుడు సమావేశమయ్యారు. నేటి సమావేశం నాల్గవది. అయినా.. ఈ నేతలు ముఖాముఖి కలుసుకోవడం మాత్రం ఇది రెండోసారి. తూర్పు, దక్షిణ చైనా సముద్ర జలలో ఎదురవుతున్న సవాళ్లను ఈ ప్రకటన అధికంగా ప్రస్తావించింది. ఈ ప్రాంతంలోని అనేక దేశాల మధ్య సరిహద్దు వివాదాలున్నాయని పేర్కొన్నది. సౌత్ చైనా సముద్రం మొత్తం తనదేనని చైనా చెప్పుకుంటున్నది. ఈ ప్రాంతంలోని అనేక దీవులను చైనా తన సైనిక స్థావరాలుగా మార్చుకుంటున్నది. వందలాది పడవలతో కూడిన మారిటైమ్ మిలిషియాను తయారుచేస్తున్నది. 'యథాతథ స్థితిని దెబ్బతీసేవిధంగా, వివాదాస్పద ప్రాంతాలలో సైనికీకరణ వంటి ఉద్రిక్తతలు పెంచే ఏ చర్యనైనా మేము తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఏకపక్షంగా, రెచ్చగొట్టే ఏ సైనికచర్యనూ సహించబోము. ఇక్కడ కోస్ట్ గార్డ్ గస్తీ పడవలను, మారిటైమ్ మిలిషియా దళాలను ఉపయోగించడాన్ని ఎట్టి పరిస్థితులలో అనుమతించం. తమ పరిధిలోని సముద్ర సంపదను వెలికితీసుకోవడానికి ఇతర దేశాలకు అవరోధాలు కల్పిస్తే అంగీకరించబోము' అంటూ తీవ్ర పదజాలంతో ఈ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉక్రెయిన్ యుద్ధం పర్యవసానంగా ఉత్పన్నమైన మానవీయ పరిస్థితుల్లో తాము నిర్వహించాల్సిన బాధ్యతల గురించి కూడా ఈ నాయకులు చర్చించారు. 'ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతలను కాపాడాలని ఈ ప్రకటనలో పునరుద్ఘాటించారు. ఏ దేశమైనా.. అంతర్జాతీయ చట్టాలను గౌరవించాల్సిందే. ఐక్యరాజ్య సమితి నియమావళిని, ఆయా దేశాల ప్రాదేశిక సమగ్రతలను పరిరక్షించాల్సిందే'నని అందులో పేర్కొన్నారు. ఆసియా సంక్షోభంపై కూడా వారు చర్చించారు. ఇటీవలి కాలంలో ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు నిర్వహించడాన్ని వారు ఖండించారు. మయన్మార్‌లో హింసకు స్వస్థి పలకాలని పిలుపు ఇచ్చారు. మహమ్మారుల కాలంలో పరస్పర సహకారం పెంచుకోవాలని, మౌలిక సదుపాయాల కల్పనలో, పర్యావరణానికి సంబంధించిన అంశాలలో చేదోడువాదోడుగా నిలవాలని కూడా ప్రతినబూనారు.

## మోడీ టూర్ కు దూరంగా కేసీఆర్

హైదరాబాద్, మే 24, :కేంద్రం, తెలంగాణ రాష్ట్రం మధ్య సంబంధాలు సవ్యంగా లేవని మరోసారి తేటతెల్లమైంది. హైదరాబాద్ రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలికేందుకు సీఎం కేసీఆర్ రావడం లేదు. ప్రస్తుతం దేశంలో పర్యటిస్తున్న కేసీఆర్.. ఈ నెల 26న బెంగళూరుకు వెళ్లనున్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 20వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని ఈ నెల 26న హైదరాబాద్ వస్తున్నారు. బిజీ షెడ్యూల్ కారణంగా సీఎం రావడం లేదని ఎూః డీన్ మదన్ పిల్లుట్ల ధ్రువీకరించారు. ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు సాధారణంగా ముఖ్యమంత్రి స్వాగతం పలుకుతుంటారు. కానీ టీఆర్ఎస్-బీజేపీ మధ్య సత్సంబంధాలు లేకపోవడంతో ఈ సంప్రదాయం మారుతోంది. ఫిబ్రవరి 5న హైదరాబాద్‌కు మోదీ వచ్చినప్పుడు కూడా కేసీఆర్ స్వాగతం పలకలేదు. నాడు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎయిర్‌పోర్టులో ప్రధానికి స్వాగతం పలికారు.

# హిందూ ఏక్తా యాత్రకు ముస్తాబైన కరీంనగర్

కరీంనగర్ మే 24 ప్రజాపాలన ప్రతినిధి :హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర' మరికొద్ది గంటల్లో ప్రారంభం కాబోతోంది. అందుకోసం కరీంనగర్ అందంగా ముస్తాబైంది. నగర వీధులన్నీ కాషాయ వర్ణమయ్యాయి. ఏక్తా యాత్ర ఊరేగింపు కోసం శ్రీరామ చంద్రుడి విగ్రహాలు, హనుమంతుడి విగ్రహాలు అందంగా రూపుదిద్దుకున్నాయి. నగరానికి చేరుకున్నాయి. కేరళ వాయిద్యాలు... భక్తి పాటలు... ధార్మిక ప్రసంగాలు... హైందవ గొప్పతనాన్ని చాటేలా ఊరేగింపులతో కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర' రాష్ట్రంలోనే హైలైట్ గా నిలవబోతోంది. కరోనా నేపథ్యంలో రెండేళ్ల విరామం అనంతరం నిర్వహిస్తున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు కనీవినీ ఎరగని రీతిలో వేలాదిగా జనం తరలిరానున్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రం నలుమూలల నుండి పెద్ద ఎత్తున హిందూ భక్తులు, యువకులు తరలి వచ్చేందుకు సిద్ధమయ్యారు. హిందూ ధార్మిక సంఘాలు, హైందవ సంస్కృతిని చాటే సంస్థల ప్రతినిధులు కూడా ఈ యాత్రకు విచ్చేయనున్నారు. స్వరాష్ట్రం నుండే కాకుండా విదేశాల నుండి కూడా కేవలం ఈ హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనేందుకు వస్తుండటం విశేషం.

రేపు సాయంత్రం 4 గంటలకు యాత్ర షురూ...

గురువారం నాజు సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ పట్టణంలోని వైశ్యా భవన్ నుండి 'హిందూ ఏక్తా యాత్ర' ప్రారంభం కానుంది. సాధు పరిషత్ అధ్యక్ష్యులు శ్రీశ్రీశ్రీ శ్రీనివాసనంద సరస్వతి స్వామిజీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్ర ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా యాత్రకు హాజరయ్యే వేలాది మంది యువకులు, భక్తులను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగిస్తారు.

ఏక్తా యాత్ర సాగే రూట్ మ్యాప్ ఇదే...

అనంతరం వేలాది జన సందోహంతో కలిసి 'హిందూ ఏక్తా యాత్ర' వైశ్య భవన్ నుండి ప్రారంభమవుతుంది. రాజీవ్ చౌక్-టవర్ సర్కిల్-ప్రకాశం గంజ్-శాస్త్రీ రోడ్-భారత్ టాకీస్-కమాన్ చౌరస్తా-బస్టాండ్-తెలంగాణ చౌక్-ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్-కోర్టు చౌరస్తా- మంచిర్యాల చౌరస్తా-గాంధీ రోడ్ మీదుగా వైశ్యా భవన్ వరకు కొనసాగనుంది.

శ్రీరామ నామస్మరణతో మారుమోగనున్న కరినగరం

దారి పొడవునా మహిళల మంగళహారతులు, కేరళ వాయిద్యాలు, భక్తి పాటలు, జై శ్రీరాం.. జై హనుమాన్ నామస్మరణలతో కరీంనగర్ యావత్తు పులకించనుంది. యువకుల కేరింతలు, మహిళల కోలాటాలు... భక్తుల దైవ నామస్మరణలు, దేవుడి వేషధారణలతో కరీంనగర్ మారుమోగనుంది. ఈ మహత్తర ఘట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు టీవీల్లో, ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా వేదికగా వీక్షించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. హిందువుల సంఘటిత శక్తిని, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడమే లక్ష్యంగా చేపట్టనున్న 'హిందూ ఏక్తా యాత్ర' ద్వారా కరీంనగర్ మరోసారి యావత్ తెలంగాణ ప్రజల దృష్టిని ఆకర్షించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

హిందూ బంధువులారా.... తరలిరండి

కరీంనగర్ లో చేపడుతున్న 'హిందూ ఏక్తా యాత్ర'కు హిందూ బంధువులంతా తరలివచ్చి హిందువుల సంఘటిత శక్తిని, ఐక్యతా స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పాలని బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కుహాన లౌకిక శక్తులు, పార్టీలు హిందువుల ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నాయని... ఈ తరుణంలో హిందువులంతా ఐక్యంగా ఉన్నారనే సంకేతాలను పంపేందుకు, హిందూ శక్తిని ప్రదర్శించేందుకే 'హిందూ ఏక్తా యాత్ర'కు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పార్స్ గుంటూరు కార్పోరేషన్ 60 వార్డుకు ప్రెసిడెంట్ గా శరణం. సాంబశివ రావు నియామకం



మే 24 ప్రజాపాలన ప్రతినిధి : పూలే అంబేడ్కర్ రాజ్యాధికారి సమితి పార్స్ గుంటూరు కార్పొరేషన్ నందు 60 వార్డుకు ప్రెసిడెంట్ గా శరణం. సాంబశివ రావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్స్ స్టేట్ కో-ఆర్డినేటర్ కటికల రవికుమార్, గుంటూరు పార్లమెంట్ పరిధిలో, గుంటూరు కార్పొరేషన్ నందు 60 వార్డుకు ప్రెసిడెంట్ గా శరణం, సాంబశివ రావు ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మీరు మీ పరిధిలో రాజకీయ అవగాహన ఉన్న ముఖ్య నాయకులతో కమిటీలను నియమించడంతో పాటు బహుజన వాదాన్ని బలపరిచే వివిధ రంగాలలో పని చేస్తున్న వారిని పార్స్ అనుబంధ సంఘాలుగా మీ పరిధిలో నియమించి, రెండు విభాగాల మధ్య సమన్వయ పరిచి వారందరి సహకారంతో బహుజన రాజ్యాధికారాన్ని సాధించాలని ఈ సంధర్భంగా ఆయన పేర్కొన్నారు. శరణం. సాంబశివ రావు నియామకం పట్ల పలువురు బహుజనులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసారు.

## బయ్యారంలో నిందితుడు ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్: బయ్యారం పోలీస్ స్టేషన్‌లో దారుణం జరిగింది. దొంగతనం విచారణ కేసులో నిందితుడు మూల కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేశాడు. వారం రోజుల్లో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. మొదటిసారి పోలీస్ స్టేషన్‌లోని శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. దాంతో ఆయన్ను మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు. కొద్దిసేపటి క్రితం రెండో సారి గాజుముక్కలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. అయితే పోలీసులు మూల కృష్ణారెడ్డిని రహస్యంగా ఆసుపత్రికి తరలించారు. మరోవైపు పోలీసుల వేధింపులే కారణమని బంధువులు ఆరోపించారు.

## నార్త్ నుంచి తెలుగు లీడర్స్ కు అవకాశం

హైదరాబాద్, మే 24, :రాజ్యసభ ఆరేళ్ళ పదవీకాలం. రాజకీయనేతలకు అదో మంచి అవకాశం. అయితే ఈమధ్యకాలంలో రాజ్యసభ సీట్లు వ్యాపారవేత్తల్ని అందలం ఎక్కిస్తున్నాయి. రాజ్యసభకు ఉత్తరాది రాష్ట్రాల నుంచి తెలుగు నేతలకు అవకాశం ఇవ్వాలని బీజేపీ భావిస్తోంది. కొన్ని చోట్ల ఏకగ్రీవాలు అవుతుంటే.. మరికొన్ని చోట్ల ఎన్నికల అనివార్యం అయ్యేలా వుంది. జూన్ 10 న ఓటింగ్ జరగనుంది. కొంతమంది నేతల్ని ఉత్తరాది నుంచి రాజ్యసభకు పంపాలని కమలం పార్టీ నేతలు భావిస్తున్నారు. ఏపీ నుంచి పరిశీలనలో సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్, పురందేశ్వరి పేర్లు వున్నట్టు తెలుస్తోంది. అలాగే తెలంగాణ నుంచి పరిశీలనలో డా. లక్ష్మణ్, గరికపాటి మోహన్ రావు, విజయశాంతి పేర్లు వున్నాయి. రాజ్యసభలో ప్రాతినిధ్యం లేని రాష్ట్రాలకు ఈదఫా అవకాశం ఇవ్వాలని బీజేపీ అధిష్టానం నిర్ణయంచినట్లు సమాచారం. రాజ్యసభలో తెలంగాణ నుంచి బీజేపీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. గతంలో ప్రాతినిధ్యం లేని తమిళనాడు, కేరళ రాష్ట్రాల బీజేపీ నేతలకు రాజ్యసభలో అవకాశం ఇచ్చింది బీజేపీ అధిష్ఠానం. ఈనెలాఖరుతో ముగియనున్న రాజ్యసభ స్థానాలకు నామినేషన్ దాఖలు చేసే ఆఖరు తేది దగ్గరపడుతోంది. టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికయి బీజేపీలో చేరే సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి అవకాశం ఇస్తామని అప్పట్లో సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్ లకు బీజేపీ అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. సుజనా చౌదరి, టీజీ వెంకటేశ్ లకు జూన్ 2 వతేదీ కల్లా పదవీకాలం పూర్తికానుంది. వీరిద్దరితో పాటు రాజ్యసభ పరిశీలనలో పురందేశ్వరి పేరు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది. దీంతో ఉత్తరప్రదేశ్ నుంచి తెలుగు రాష్ట్ర నేతలకు అవకాశం లభించనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల నుంచి ఒక్కొక్కరికి రాజ్యసభ లో అవకాశం రానుంది. సమీకరణలు కుదరని పక్షంలో ఒకరికి రాష్ట్రపతి కోటాలో నామినేటెడ్ పదవి లభిస్తుందని తెలుస్తోంది. తెలంగాణ నుంచి రాజ్యసభ పదవులకు పరిశీలనలో రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లు. మరో రెండు మూడు రోజులలో బీజేపీ అధిష్ఠానం నిర్ణయం తీసుకోనుంది.

# రూపాయి ఎందుకు ఇలా..!

అమెరికా డాలర్‌తో రూపాయి విలువ ఇంతకుముందెన్నడూ లేనంత అథమ స్థాయికి పడిపోయింది. ఒక డాలర్ కిమ్మత్తు రూ.77.50కు సమానం అయింది. ఆ తర్వాత అదే రోజు స్వల్పంగా తేరుకున్నప్పటికీ రూ.77.23 వద్ద రూపాయి వాల్యు భారీగా పతనమైంది.. ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయాందోళనలతో గ్లోబల్ మార్కెట్లు భారీగా పతనమవుతుండటంతో.. రూపాయి కుప్పకూలింది. సోమవారం ఉదయం ట్రేడింగ్‌లోనే 77.41 స్థాయిలకు పడిపోయిన రూపాయి.. చివరికి కూడా 77.50 వద్ద క్లోజైంది. చివరి సారి మార్చి 7, 2022న రూపాయి వాల్యు అత్యంత కనిష్ట స్థాయి రూ.76.98ను తాకిన సంగతి తెలిసిందే. ఫెడరల్ రిజర్వు బ్యాంకు పెంచిన వడ్డీ రేట్లు ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయగలవా..? అని ట్రేడర్లు ప్రశ్నిస్తుండటంతో.. గ్లోబల్ మార్కెట్లు కుప్పకూలాయి. అంతేకాక కరోనా మహమ్మారిపై చైనీస్ లీడర్లు మళ్లీ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. బ్యాంకు ఆఫ్ ఇంగ్లాండ్ కూడా వడ్డీ రేట్లను పెంచుతూ.. మాంద్యంలోకి జారుకునే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇవన్ని కలిసి రూపాయిని దెబ్బకొట్టాయి. డాలర్‌తో రూపాయి అసాధారణ దిగజారుడు వల్ల మనం చేసుకునే దిగుమతులు ఖరీదవుతాయి. అదే సమయంలో ఎగుమతులపై రాబడి తగ్గుతుంది. విదేశీ చదువులు, పర్యటనలు అధిక ఖర్చుతో కూడినవిగా మారుతాయి. ద్రవ్యోల్బణం తక్షణ భవిష్యత్‌లో పేట్రేగుతుంది. ఇటువంటప్పుడు భారతీయ రిజర్వు బ్యాంకు తన వద్ద గల డాలర్ నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి రూపాయి విలువను కాపాడడం ఆనవాయితీగా వస్తున్నది. కాని ఇటీవలి కాలంలో ఆర్‌బిఐ ఈ విషయంలో నిగ్రహం పాటిస్తున్నది. పర్యవసానంగా మరి కొద్ది రోజుల్లోనే డాలర్ విలువ మరింత పెరిగి రూపాయి ఇంకా పతనం కాగలదని పరిశీలకులు భావిస్తున్నారు. త్వరలోనే డాలర్ కిమ్మత్తు రూ.78 కావచ్చును. దేశం నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అసాధారణ స్థాయిలో తరలిపోతున్నందున రూపాయి ఈ స్థాయికి దిగజారిపోయిందని తెలుస్తున్నది. విదేశీ మదుపరులు వరుసగా ఏడో మాసం మన దేశం నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. చైనాలో పరిస్థితులు కూడా డాలర్‌తో రూపాయి మారకపు విలువ భారీ పతనానికి దోహదపడ్డాయి. ప్రపంచంలోకెల్లా అత్యధిక డాలర్ నిల్వలున్న దేశం చైనా. అవి మన స్థూల దేశీయోత్పత్తి విలువ కంటే ఎక్కువని సమాచారం. ఇటీవల చైనాలో కొవిడ్ తిరిగి విజృంభించిన నేపథ్యంలో దాని అంతు చూడాలని అక్కడి పాలకులు నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం అనేక నగరాల్లో సంపూర్ణ లాక్‌డౌన్ విధించారు. ఆ నగరాలతో ఆర్థిక సంబంధాలున్న మన దేశంలోని అనేక కంపెనీల వ్యాపారాలు కష్ట కాలాన్ని ఎదుర్కొంటున్నాయి. డాలర్‌తో రూపాయి అపూర్వ పతనానికి ఇది కూడా ఒక కారణం. అమెరికా ఫెడరల్ బ్యాంకు డాలర్ విలువను పెంచడం కూడా ఇందుకు దారి తీసిన ఈ కారణాల్లో ఒకటని బోధపడుతున్నది. దేశంలో మితిమించిపోయిన ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తేవడానికి రిజర్వు బ్యాంకు ఈ మధ్య వడ్డీ రేట్లను భారీగా పెంచింది. అందు వల్ల కూడా రూపాయి విలువ తరిగిపోయిందని నిపుణులు భావిస్తున్నారు. గత నెల రోజులుగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరుగుతూ వుండడం మరొక కారణమని స్పష్టపడుతున్నది. భారత దేశ ఆర్థిక వ్యవస్థ మంచి చెడులు ప్రధానంగా దాని విదేశీ వాణిజ్య బలంపై ఆధారపడి వుంటుంది. ఆ మాటకొస్తే ఏ దేశ ఆర్థిక బలం పుంజుకోడం లేదా కుంగిపోడం అనేదానికి మూలంలో వుండేవి దాని విదేశీ వాణిజ్య లాభనష్టాలే. డాలరుతో ఎగుమతుల కంటే దిగుమతుల భారం ఎక్కువగా వుండే దేశాల కరెన్సీ మారకపు విలువ పరిమితంగా వుంటుంది. చైనా తన వాణిజ్య మిగులుతో అమెరికాను కూడా భయపెట్టగల ఆర్థిక బలాన్ని పుంజుకున్న సంగతి తెలిసిందే. మనం మన క్రూడాయిల్ అవసరాల్లో 80 శాతం మేరకు దిగుమతులపైనే ఆధారపడి వున్నాము. ఇది మన విదేశీ వాణిజ్యాన్ని నిరంతరం లోటులోనే వుంచుతుంది. ఎగుమతులను పెంచుకున్నప్పటికీ దిగుమతుల భారం అంతకుమించి వుండేటప్పుడు ఈ వాణిజ్యంలో అంతిమంగా లోటే తేలుతుంది. అందుచేత డాలర్‌తో మన రూపాయి పతనావస్థలో కొనసాగడం ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. అయితే, ఇంతకు ముందెన్నడూ లేనంతగా డాలర్‌తో మన కరెన్సీ విలువ రూ.78కు చేరుకుంటూ వుండడం ఆందోళనకరం. దేశ ఆర్థిక వ్యవస్థను అత్యంత పటిష్ఠంగా మెరుగుపరుస్తామని గొప్పలు చెప్పుకున్న ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని ఇది బోనులో నిలబెడుతున్నది. తొమ్మిదేళ్ల క్రితం 2013 ఆగస్టులో డాలర్ విలువ రూ. 64 లకు ఎగబాకినప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్న నరేంద్ర మోడీ అప్పటి యుపిఎ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఆందోళన చెందడం లేదని, రూపాయి విలువను కాపాడాలనే సదుద్దేశంతో పరిపాలన సాగించడం లేదని కేవలం అధికారంలో కొనసాగడమే లక్షంగా మనుగడ సాగిస్తున్నదని ఆయన అప్పట్లో తీవ్రంగా విరుచుకుపడ్డారు. భారత రూపాయి గొప్పలు చెప్పుకొన్న రోజులు గతంలో వున్నాయనీ ఇప్పుడైతే దాని నోరు పడిపోయిందని, అదే విధంగా ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా మౌనాన్ని ఆశ్రయిస్తున్నారని నరేంద్ర మోడీ అప్పట్లో ఛలోక్తులు విసిరారు

# రచ్చ గెలిచే పనిలో గులాబీ దళం



హైదరాబాద్, మే 24, :తెలంగాణ ముఖ్యమంత్రి, తెరాస అధ్యక్షుడు కే. చంద్రశేఖరరావుకు తెలుగు భాష,సాహిత్యంపై మంచి పట్టుంది. అందులో సందేహం లేదు.అదే విధంగా ఆయన రాజకీయ చతురత విషయంలోనూ ఎవరికీ ఎలాంటి సందేహాలు ఉండవలసిన అవసరం లేదు. అందుకే, ఆయన ఇప్పుడు అవునన్న విషయాన్ని మరో క్షణంలో కాదనీ అనగలరు. నిజమే, రాజకీయ నాయకులు మాట మీద నిలబడడం అంటే, అది అయ్యే పని కాదు. అందుకే గురజాడవారి గిరీశం, 'ఒపినిఒన్స్ మార్చుకోలేని వారు రాజకీయ నాయకులు కాలేర'ని అన్నారు. అయితే అదే సమయంలో ఏ ఎండకా గొడుగు పట్టే రాజకీయ నాయకుల విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రజలు అలాంటి నాయకులను పక్కన పెడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణలో పరిస్థితి అదే, విశ్వసనీయత కోల్పోయినందునే తెరాస ఇరకాటంలో పడిందని, పరిశీలకులు పేర్కొంటున్నారు. ఇది నడుస్తున్న చరిత్ర చెపుతున్న మరో సత్యం. అందుకు కూడా ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రే కేసీఆరే, ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నారు అంటున్నారు. ముఖ్యమంత్రి దళిత ముఖ్యమంత్రి మొదలు దళితులకు మూడు ఎకరాల భూమి వరకు, కేజీ నుంచి పీజీ, వరకు ఉచిత విద్య, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వరకు ఇంకా అనేక విషయాల్లో ఏ విధంగా మాట మార్చారో, వేరేగా చెప్పనవసరం లేదు. గూగుల్'ని అడిగితే చాలు, ముఖ్యమంత్రి మాట మార్చిన సందర్భాలకు సంబంధించిన వీడియోలు పరుగులు తీస్తాయి. ఇక ప్రస్తుతానికి వస్తే, ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రైతు చట్టాలను ఒకప్పుడు సమర్ధించారు. ఇప్పుడు, ఆ చట్టాలు రద్దయిన తర్వాత, కేంద్ర ప్రభుత్వమే ఆ చట్టాలను వెనక్కి తీసుకున్న తర్వాత, ఆ చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. ఆ చట్టాలకు వ్యతిరేకగం ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరం పాటు సాగిన ఆందోళనలో చనిపోయిన పంజాబ్ రైతులకు పరిహారం పంచి పెట్టారు. సరే, తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకున్న రైతులను ఎండగట్టి, పంజాబ్ రైతులకు తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని పందారం చేయడం ఏమిటని, ప్రతి పక్షాలు, ప్రజలు చేస్తున్న విమర్శలను పక్కన పెట్టినా. రైతు చట్టాల విషయంలో ముఖ్యమంత్రి ద్వంద ప్రమాణాలు పాటిస్తున్నారని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి మాట మర్చారనే విమర్శలు వినవస్తున్నాయి.అదే విధంగా ధాన్యం సేకరణ విషయంలో, నిన్న మొన్నటి వరకు కేంద్ర ప్రభుత్వం పంజాబ్'కు ఒక విధానం, తెలంగాణకు ఒక విధానం అవలంబిస్తోందని పంజాబ్ రైతులకు వ్యతిరేకంగా, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆందోళన చేసిన ముఖ్యమంత్రి, ఇపుదు అదే పంజాబ్ గడ్డ మీద (చండీగఢ్)నుంచి దేశంలోని రైతు సంఘాలన్నీ సంఘటితం కావసిన సమయం ఆసన్నమైందని, మరో రైతు ఉద్యమానికి పిలుపునీయడం ముఖ్యమంత్రి ద్వంద నీతిని మరోమారు రుజువు చేసిందని పరిశీలకులు భావిస్తున్నారు. విపక్షాలు విమర్శిస్తున్నాయి. నిజానికి, ఇప్పటికే చాలా వరకు జాతీయ, ప్రాంతీయ పార్టీలు కేసీఆర్'ను అంతగా విశ్వాసంలోకి తీసుకోరనే ప్రచారం జరుగుతోంది. అందుకే 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యాన్మాయంగా థర్డ్ ఫ్రంట్ ఏర్పాటు కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఒకడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు నడుస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. నిజానికి, గతంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్' ముంబై వెళ్లి ఎన్సీపీ అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి, శివసేన అధినేత ఉద్దవ్ థాకరే'ని కలిసి ఫ్రంట్ కట్టడం పై మంతనాలు జరిపారు. అలాగే, చెన్నై వెళ్లి తమిళనాడు ముఖ్యమంత్రి ,డీఎంకె అదినేత స్టాలిన్'తోనూ కాంగ్రేస్సేతర, బీజేపీ యేతర ఫ్రంట్ ఏర్పాటు గురించి మంతనాలు సాగించారు.ఆ సమయంలో ఇంకేముంది, హైదరాబాద్ వేదికగా ఫ్రంట్ ఏర్పాటు అయిపోయినట్లే అనే గంభీర ప్రకటనలు చేశారు.అయితే, ముఖ్యంత్రి ఇలా రాగానే, ఎన్సీపీ, డీఎంకే, శివసేన సహా ఇతర పార్టీలు నాయకులు కాంగ్రెస్ లేని ఫ్రంట్' వృధా ప్రయాస అని తేల్చి చెప్పారు. కాంగ్రెస్'తోనే కలిసి సాగుతామని స్పష్టం చేశారు. అంతలోనే మళ్ళీ ఆయనే థర్డ్ ఫ్రంటూ లేదు ఫోర్త్ టెంటెంటు లేదని తేల్చేశారు. ఇప్పుడు మళ్ళీ ప్రాతీయ పార్టీల నేతలతో మంతనాలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఢిల్లీలో కేసేఆర్ , ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్'తో , అంతకు ముందు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ, అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్'తో సమావేశ మయ్యారు. గతంలో పవార్, థాకరే, స్టాలినలానే కేజ్రీవాల్', అఖిలేష్ యాదవ్' కూడా అల్టిమేట్'గా కేసీఆర్'తో చేతులు కలవక పోవచ్చని అంటున్నారు. నిజానికి గతంలోనే కేజ్రీవాల్'ను అప్పాయింట్మెంట్ కోసం ముఖ్యంత్రి కేసీఆర్ నాలుగైదు రోజులు ఢిల్లీలో వెయిట్ చేసారు. అయినా, ఫలితం లేక పోయింది.అప్పట్లో,కేసేఆర్'ను కలవడం ఇష్టం లేకనే కేజ్రీవాల్ ఆయనకు అప్పాయింట్మెంట్ ఇవ్వలేదనే వార్తలొచ్చాయి.అదే విధంగా, ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో మమతా బెనర్జీతో కలిసి వారణాసి ఎన్నికల సభలో కేసీఆర్ పాల్గొంటారని వార్తలు అయితే వచ్చాయి కానీ, కేసీఆర్ వారణాసి వెళ్ళలేదు. మమతా బెనర్జీ, అభ్యంతరం చెప్పడం వల్లనే అఖిలేష్ యాదవ్, కేసీఆర్' ను రావద్దని కోరారని అప్పట్లో ప్రచారం జరిగింది. నిజానిజాలు ఎలా ఉన్నా, ఇప్పుడు కూడా పంజాబ్ రైతులకు పరిహారం ఇస్తామంటే వద్దనడం భావ్యం కాదని కేజ్రీవాల్, సరే అన్నారని, తెలంగాణా ఆప్ నాయకుల సమాచారం. అందుకే, ముఖ్యమంత్రి కేసేఆర్ జాతీయ రాజకీయాలలో రాణించేందుకు చేస్తున్న తాజా ప్రయత్నాల విషయంలోనూ అనుమాలే వ్యక్తమవుతున్నాయి. నిజానికి, ముఖ్యమంత్రి జాతీయ యాత్రకు సంబంధించి కేసీఆర్, తెరాస సమాధానం చెప్పవలసిన ప్రశ్నలు చాలనే ఉన్నయని పార్టీ అంతర్గత వర్గాలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# సెంచరీ కొట్టేసిన టమాటా



వరంగల్, మే 24, :టమాట ధర తారాెత్తిస్తోంది. కొద్దిరోజులుగా క్రమంగా పెరుగుతూ బహిరంగ మార్కెట్లో వినియోగదారుడిని భయపెడుతోంది. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరగడంతో సామాన్యులు వాటివైపు చూసేందుకే ఆలోచించాల్సిన పరిస్థితి తయారైంది. సమయానికి ఏ కూరగాయలు అందుబాటులో లేకపోతే కనీసం నాలుగు టమాటలైనా వండొచ్చుగా.. సాధారణంగా ప్రతీ మధ్య తరగతి కుటుంబాల్లో విన్పించే మాట ఇది. కానీ ఇప్పుడు అదే మాట వంటింట్లో మంట రేపుతోంది. నెల క్రితం కిలో రూ. 10 పలికిన టమాట ప్రస్తుతం కిలో రూ. 80కి చేరింది. రోజు రోజుకూ టమాట ధర సామాన్యుల కు భారంగా మారింది. టమాట వండుకోవడం మాట అటుంచితే కనీసం వాటి గురించి కూడా ఆలోచించే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్కోసారి రూ. 1కి కిలో చొప్పున అమ్మినా కొనేవారు లేక రోడ్లపై పారబోసే పరిస్థితి వచ్చింది. ఇప్పుడేమో ధరలు భగ్గుమంటున్నాయి. గత మూడురోజుల్లో నే ఏకంగా రోజుకు రూ. 10 చొప్పున పెరుగుతూ వినియోగదారులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. జిల్లాలో ఈ సారి యాసంగి టమాట ఉత్పత్తి తగ్గింది. సాధారణం కంటే ఎండలు అధికంగా ఉండటంతో పూత రాక పంట తగ్గింది. దీనికి తోడు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు, ఈదురు గాలులకు టమాట పంటకు నష్టం వాటిల్లింది. దీంతో హోల్‌సేల్ వ్యాపారులు చిత్తూరు జిల్లా మదనపల్లి, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి టమాటను తెప్పించి విక్రయిస్తున్నా రు. ఆయా ప్రాంతాల్లో రైతులు షేడ్ నెట్లలో టమాటను సాగు చేస్తుంటా రని, దీంతో ఎండ వేడమి నుంచి రక్షణ లభించి పంట దిగుబడి అధికంగా వస్తుందని వ్యాపారులు తెలిపారు. స్థానికంగా సరైన పంట ఉత్పత్తి లేకపోవడంతో టమాట ధరకు రెక్కలొచ్చాయి. ఏప్రిల్ 15వ తేదీ వరకు కిలో రూ. 10కి లభించిన టమాట ప్రస్తుతం కిలో రూ. 80కి చేరింది. ధర పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు టమాట కొనుగోలు చేయాలంటే జంకుతున్నారు. ఈ ధరలు జూన్, జూలై వరకు ఇలాగే కొనసాగే అవకాశాలు ఉన్నట్లు ఉద్యాన శాఖా ధికారులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

## పుట్టపాక గ్రామ శివారులో రోడ్డుప్రమాదం




యాదాద్రి భువనగిరి: జిల్లాలోని నారాయణపురం మండలం పుట్టపాక గ్రామ శివారులో రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ క్వాలిస్ డీకొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేద్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేద్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ Rs 5000/-
13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, Rs 5000/-
14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ Rs 2000/-
15. రత్నశ్రీ పార్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ Rs 2000/-

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.


# కాంగ్రెస్ లో డిక్లరేషన్ జోష్

మహబూబ్ నగర్, మే 24, :వరంగల్ డిక్లరేషన్ తో కాంగ్రెస్ స్పీడ్ పెంచింది. టీఆర్ఎస్, బీజేపీలపై ఘాటు విమర్శలతో చెలరేగిపోతున్నది. కాంగ్రెస్ కు సహజ రుగ్మతలుగా చెప్పుకునే అంతర్గత విభేదాలను దాటి జనంలోకి దూకుడుగా వెళ్లేలా వరంగల్ డిక్లరేషన్ తో స్కెచ్ వేసుకుంది. టీఆర్ఎస్ సర్కార్ అత్యంత ప్రతిష్ఠత్మకంగా ప్రారంభించిన ధరణి పోర్టల్ కుప్పుస్వామి మేడ్ డిఫికల్టీలా తయారైందన్న విమర్శలతో రైతులకు చేరువయ్యే వ్యూహాన్ని అమలు చేస్తున్నది. ధరణి పోర్టల్ వల్ల రైతుల ఇబ్బందులు రెట్టింపయ్యాయన్న విమర్శలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిని టీఆర్ఎస్ ప్రభుత్వానికి కల్పించింది. ధరణి పోర్టల్ కు ముందు పరిస్థితే మేలని రైతులు చెబుతున్నారు. వచ్చే ఎన్నికలలో టీఆర్ఎస్ కు ధరణి పోర్టల్ వల్ల నష్టం తప్పేటట్లు లేదని పరిశీలకులు సైతం విశ్లేషణలు చేస్తున్నారు. సరిగ్గా ఈ పరిస్థితినే కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకునేలా వ్యూహ రచన చేసి దూసుకుపోతున్నది. ధరణి వల్ల రైతుల ఇబ్బందులను గమనించిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ధరణిని తీసేస్తామని హామీ ఇస్తున్నది. అదే సమయంలో రాష్ట్రంలో దూకుడు పెంచిన బీజేపీ ధరణిపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించడంలో వెనుక బడింది. రాహుల్ గాంధీ వరంగల్ సభలో టీపీస్ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ధరణిపై చేసిన ప్రకటనకు రైతుల నుంచి మంచి స్పందన వచ్చిందని పార్టీ వర్గాలు అంటున్నాయి. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్ ను తీసేస్తామన్న తమ హామీని మరింతగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. రైతు కష్టాలను అడ్రస్ చేయడంలో కాంగ్రెస్ బీజేపీ కంటే మెరుగ్గా, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది.వరంగల్ డిక్లరేషన్ తో రైతులలో విశ్వాసాన్ని పొందామని భావిస్తున్న కాంగ్రెస్ ఆ దిశగా మరింత దూకుడుగా ముందుకు వెళ్లాలని భావిస్తోంది. రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో త్రిముఖ పోరు అనివార్యమని భావిస్తున్న నేపథ్యంలో రైతు సమస్యలపై కాంగ్రెస్ సీరియస్ గా పని చేయాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే రచ్చ బండ కార్యక్రమంలో ధరణి పోర్టల్ వల్ల రైతుల ఇబ్బందులపై ప్రముఖంగా ప్రస్తావించాలని నిర్ణయించుకుంది. వరంగల్ డిక్లరేషన్ ద్వారా రైతులు పండించే పంటకు మద్దతు ధర కల్పించడంతో పాటు కౌలు రైతులకు పంట రుణమాఫీ అమలు హామీలపై రైతులలో కాంగ్రెస్ పట్ల సానుకూలత వ్యక్తమౌతున్నదన్న పరిశీలకుల విశ్లేషణలతో కాంగ్రెస్ లో జోష్ పెరిగింది.కొనుగోలు కేంద్రాల పేరుతో తెలంగాణ సర్కార్ రైతులను దగా చేసిందనీ, కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో అకాల వర్షాలకు రైతుల తీసుకు వచ్చిన ధాన్యం తడిసి ముద్దై నష్టాలలో కూరుకుపోయారనీ కాంగ్రెస్ విమర్శిస్తున్నది. అన్నిటికీ మించి ధాన్యం కొనుగోళ్ల విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రం పరస్పర విమర్శలతో విలువైన కాలాన్ని వృధా చేసి రైతులతో అయోమయం నెలకొల్పారని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. తెలంగాణలో రైతులు ధాన్యం కల్లాల వద్ద మరణిస్తుంటే..వారి వైపు కన్నెత్తి చూడని సీఎం కేసీఆర్ పంజాబ్ రైతులకు ఆర్థిక సాయం చేయడానికి వెళ్లడాన్ని ప్రశ్నిస్తోంది. సరిగ్గా ఆ అంశంలోనే రాష్ట్రంలో రైతులు కూడా కేసీఆర్ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని టీఆర్ఎస్ వర్గాలలోనే చర్చ నడుస్తోంది.

రాష్ట్రంలో సమస్యలను గాలికి వదిలేసి జాతీయ రాజకీయాలంటూ సీఎం చేస్తున్న ప్రసంగాల పట్ల జనంలో పెద్దగా స్పందన రావడంలేదనీ, పైపెచ్చు ఆయన జాతీయ అంశాలు ప్రస్తావించే ప్రతి సారీ జనం రాష్ట్ర సమస్యలపై ప్రశ్నలు సంధిస్తున్నారనీ పరిశీలకులు ఉదాహరణలతో విశ్లేషణలు చేస్తున్నారు.సరిగ్గా ఈ అంశాన్నే కాంగ్రెస్ అందిపుచ్చుకుని జాతీయ పార్టీగా తాము ప్రాంతీయ అంశాలపై పోరాడుతున్నామని చెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నది. కేంద్రం ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందనీ, కేసీఆర్ రాష్ట్ర సమస్యలను విస్మరించి దేశం పట్టుకు తిరుగుతున్నారన్న విమర్శలతో దూకుడుగా ప్రజలలోకి వెళుతోంది. కాంగ్రెస్ లో ఈ జోష్.. ప్రజలను ఆ పార్టీకి చేరువ చేస్తుందా.. లేక పార్టీలో అంతర్గత విభేదాలు, నేతల మధ్య భేదాభిప్రాయాలతో మర మారు ప్రజల ముందు పలుచన అవుతుందా వేచి చూడాలి

ప్రజాపాలన

సంపాదకీయం

బుధవారం 25, మే 2022

## హస్తినలో కెసిఆర్ కుప్పిగెంతులు

కేంద్రంలో గత ఎనిమిదేళ్ల కాలంలో రాజకీయ అస్థిరతా పరిస్థితులు ఎప్పుడైనా కనిపించాయా? 2జీ, బొగ్గుగనుల కేటాయింపులు, కామన్ వెల్త్ క్రీడల నిర్వహణ తదితర అంశాల్లో జరిగిన వేల కోట్ల రూపాయల కుంభకోణాలు ఇప్పుడెక్కడైనా కనిపిస్తున్నాయా? ఎక్కడ చూసినా కొడుకులు, కూతుళ్లు, భార్యలు, బంధువులు రాజ్యమేలే కంపుగొట్టే వారసత్వ ఛాయలు ఎక్కడైనా మనకు గోచరిస్తున్నాయా? ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావు లేకుండా ఇంత భారీ ఎత్తున ప్రాజెక్టులు, రహదార్లు, జాతీయ కారిడార్లు అభివృద్ధి అయిన దాఖలాలు ఎనిమిదేళ్ల క్రితం ఎప్పుడైనా ఉన్నాయా? కోట్లాది సామాన్యులకు, మహిళలకు, రైతులకు నేరుగా వారి ఖాతాల్లోకి లక్షల కోట్లు ఎలాంటి మధ్య దళారీల ప్రమేయం లేకుండా బదిలీ అయిన ఉదంతాలను గతంలో మనం చూశామా? దేశంలోనూ, విదేశాల్లోనూ భారతదేశ అస్తిత్వం, సాంస్కృతిక వారసత్వం గురించి ప్రతి భారతీయుడూ సగర్వంగా చెప్పుకోగల పరిస్థితులు ఇదివరకు ఎప్పుడైనా మనం చూడగలిగామా? ఎనిమిదేళ్ల క్రితం నిత్యం విచ్ఛిన్న కార్యకలాపాలకు పాల్పడే సంఘ విద్రోహ, ఉగ్రవాద శక్తులు ఇప్పుడు ఎక్కడైనా తచ్చాడుతున్నాయా? ప్రజలతో నిత్యం సజీవ సంబంధాలు పెట్టుకుంటూ రకరకాల కార్యక్రమాల ద్వారా కోట్లాది ప్రజలతో సంభాషించే ప్రధానమంత్రి గతంలో ఎప్పుడైనా ఉన్నారా? తనకంటూ ఒక కుటుంబం లేక, అక్రమ సంపాదనకు పాల్పడాల్సిన ఏ అవసరమూ లేక అహోరాత్రాలు నిత్యం పనిచేసే ప్రధానమంత్రి గతంలో ఎప్పుడైనా మనకు కనిపించారా? ఈ ఎనిమిదేళ్లలో ప్రపంచ అగ్ర నేతల్లో ఒకరుగా నరేంద్రమోదీ ఎందుకు గుర్తింపు పొందగలిగారు? త్వరలో తన ఎనిమిదేళ్ల పాలనను పూర్తి చేసుకుంటున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ అద్వితీయ విజయాల గురించి ఎంత చెప్పినా సరిపోదు. దేశంలో సమతుల్య అభివృద్ధికి, సామాజిక న్యాయానికి, సామాజిక భద్రతకు ఈ ఎనిమిదేళ్లు అంకితం చేశామని గత వారం జైపూర్‌లో బిజెపి ఆఫీసు బేరర్ల సమావేశంలో ప్రధానమంత్రి ఒక్క మాటలో చెప్పారు. సుపరిపాలన ద్వారా ప్రజా సంక్షేమం ఏ విధంగా సాధించవచ్చునో ఆయన నిరూపించారు. చిన్న రైతులు, కష్టించే శ్రమజీవులు, మధ్య తరగతి ఆకాంక్షలను సఫలీకృతం చేసే దిశలో ఏ విధంగా పనిచేయవచ్చునో ఆయన నిరూపించారు. బలహీనవర్గాలు, మహిళా సాధికారిత కోసం, స్వచ్ఛ మైన భారతదేశం కోసం, నిర్మాణాత్మకమైన కార్యకలాపాల కోసం ఏ విధంగా కృషిచేయవచ్చు అన్నదానికి ఆయన ఉదాహరణగా నిలిచారు. నరేంద్ర మోదీ ఎప్పుడూ వెనుకంజ వేసే నాయకుడు కాదు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా మరో పాతికేళ్లలో ప్రభుత్వం ఎంత వేగంగా పనిచేయాలో అన్నదానికి ఆయన లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. భారతీయ జనతా పార్టీ కూడా తన లక్ష్యాలను నిర్దేశించుకుని వచ్చే పాతికేళ్లు నిరంతరం పనిచేయాలని ఆయన జైపూర్ సమావేశంలో పిలుపునిచ్చారు. పనిచేయడమంటే ఏమిటి? రాజకీయ అధికారం కోసం ప్రాముఖ్యం ఇవ్వడం కన్నా ప్రజలకు సేవభావంతో పనిచేయడమే ముఖ్యమని మోదీ విశ్వసిస్తారు. కరోనా మహమ్మారి సమయంలో, ప్రజల్లోకి వెళ్లి ముమ్మరంగా సేవ చేయాలని పార్టీ కార్యకర్తలకు ఆయన చెప్పారు. రాజకీయ కార్యకర్తలుగా కాకుండా ఎన్జీవో సేవకులుగా పనిచేయాలని ఆయన కోరారు. తనను తాను ప్రధానమంత్రిగా కాకుండా ప్రధాన సేవకుడుగా భావించిన ఏకైక రాజకీయ నాయకుడు మోదీయే. రైల్వే స్టేషన్‌లో చాయ్ అమ్మే ఒక సామాన్యుడి స్థాయి నుంచి పేదరికాన్ని తట్టుకుంటూ తాను ఎదిగిన వైనాన్ని ఆయన ఎప్పుడూ చెప్పేది అందుకే. తనను సేవ చేసే నేతగా చిత్రించాలని కార్యకర్తలను మోదీ ఎప్పుడూ కోరుతుంటారు. ఎనిమిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ విజయాలు, ఆశయాల గురించి వివరించేందుకు కేంద్ర మంత్రులను, సీనియర్ నేతలను కూడా ప్రజల్లోకి ఉధృతంగా వెళ్లమని ఆయన కోరారు. సంక్షేమపథకాల ప్రయోజనాలను పొందిన లబ్ధిదారులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయమని ఆయన నిర్దేశించారు. వారి వల్లే బిజెపి అధికారంలోకి రాగలుగుతుందనేది ఆయన ప్రగాఢ నమ్మకం. మోదీ ఎనిమిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ప్రజలకు ప్రభుత్వం ఏమి చేసిందో, ఏమి చేయబోతున్నదో వివరించే ఒక రిపోర్టు కార్డును విడుదల చేసేందుకు పార్టీ, ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయి. మోదీ ఎనిమిదేళ్ల పాలన ముందు ఆరు దశాబ్దాల కాంగ్రెస్ పాలన ఏ విధంగా వెలవెలబోతుందో ఈ రిపోర్టు కార్డు వెల్లడిస్తుంది. ఈ ఎనిమిదేళ్లలో పేదరికం ఏ విధంగా క్షీణించిందో, దేశంలో కొత్త అభివృద్ధి రాజకీయాలకు ఏ విధంగా స్థానం లభించిందో, కుల, వారసత్వ, ప్రాంతీయ రాజకీయాలకు ఏ విధంగా కాలం చెల్లిందో కూడా వివరించేందుకు బిజెపి సన్నద్ధంగా ఉన్నది. తెలంగాణలో కాళ్ల క్రింద నేల జారిపోతున్న ముఖ్యమంత్రి కెసిఆర్ జాతీయ రాజకీయాల్లో స్థానం సంపాదించుకోవడం కోసం ఢిల్లీకి వచ్చారు! రైతులపై కపట ప్రేమను ఒలికిస్తూ పంజాబ్‌లో ఉపన్యాసాలు చేయడం కూడా బిజెపిపై దుష్ప్రచారం చేసి తన పబ్బం గడుపుకోవడానికే అన్న విషయం స్పష్టమవుతోంది. గత ఎనిమిది సంవత్సరాలుగా బిజెపిపై కాంగ్రెస్ ఎన్ని దుష్ప్రచారాలు చేసిందో, ఎన్ని అభాండాలు వేసిందో కెసిఆర్‌కు తెలియనిది కాదు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌కు సాధ్యం కానిది కెసిఆర్‌కు సాధ్యమవుతుందా? ఉత్తర ప్రదేశ్ వంటి 80 లోక్‌సభ స్థానాలున్న పెద్ద రాష్ట్రంలో సమాజ్‌వాది పార్టీ బిజెపిని ఓడించడానికి ఎంత విఫలయత్నం చేసిందో కెసిఆర్‌కు తెలియనిది కాదు. యూపిలో మూడోవంతు సీట్లు కూడా లేని తెలంగాణ నుంచి ఒక నేత జాతీయ స్థాయిలో బిజెపిని ఎదుర్కొనేందుకు పోరాడాలని పిలుపునిస్తే జనం ప్రతిస్పందిస్తారనుకోవడం హాస్యాస్పదం. అంతేకాదు, తెలంగాణలో విచ్చలవిడి అవినీతి తాండవిస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువుల పాలన నడుస్తోంది. అప్పులు చేయడంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయని ఇటీవల ఒక సర్వే తేల్చింది. వేస్ అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్ తదితర సౌకర్యాల క్రింద తెలంగాణ, ఏపీతో పోటీ పడి అప్పులు తీసుకుంటోంది. తెలంగాణ ప్రత్యేక ఆర్థిక కార్యదర్శి అప్పులకోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్వంత జిల్లాలో రైతులు అప్పులు చెల్లించలేక పురుగుల మందులు త్రాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పంచాయితీల్లో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని, కూలీలకు కూడా ఐదు నెలలుగా డబ్బులు ఇవ్వలేకపోతున్నామని సర్పంచులు వాపోతున్నారు. ఉద్యోగులకు నెలసరి జీతాలు కూడా అందడం లేదు. తెలంగాణలో ఒక అస్తవ్యస్త పాలనను కొనసాగిస్తూ దేశ రాజధానికి వచ్చి ప్రధాని మోదీని విమర్శిస్తే సూర్యుడిపై ఉమ్మివేసిన చందంగానే ఉంటుంది. కెసిఆర్ వైఖరి చూస్తుంటే జాతీయ రాజకీయాల పేరుతో ఢిల్లీకి వచ్చి రాష్ట్రంలో తన వారసుడికి అధికారం అప్పజెప్పేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు కనపడుతోంది. అయితే తెలంగాణలో బిజెపికి అధికారం అప్పజెప్పేందుకు కూడా కెసిఆర్ రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ఏతావాతా కెసిఆర్ భవిష్యత్తు రెంట చెడ్డ రేవడిలా మారడం ఖాయం.

## ‘సిర్పూర్కర్’ తవ్వితీసిన చేదు నిజాలు




దిశహత్యానంతరం జరిగిన పోలీసు కాల్పుల ఘటనపై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ ఎట్టకేలకు తన నివేదికను సమర్పించింది. ఇప్పటికే కమిషన్ నిర్ధారించిన ముఖ్యమైన విషయాలను మీడియా ప్రస్తావించింది. కానీ ఇంకొన్ని వివరాలను, వాటి స్వభావాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. ఈ ఘటనలో పోలీసులు ఉద్దేశపూర్వకంగా నిందితులను చంపాలనే ఆలోచనతోనే కాల్పులు చేశారుబీ కాల్పులు నిందితుల మరణానికి అనివార్యంగా దారితీస్తుందని ఎరుకతోనే చేసారు, ఈ ఘటనలో పాల్గొన్న పదిమంది పోలీసు అధికారులపై హత్యా నేరారోపణ కింద విచారణ జరపాలి అనే అభిప్రాయాన్ని కమిషన్ వెలిబుచ్చింది. ఈ పదిమంది తమకు తాముగా నిర్ణయం తీసుకుని ఈ లాంటి చర్యకు పాల్పడే అవకాశం ఉందా అనే లోతుల్లోకి కమిషన్ పోలేదు. అది తనకు తానుగా విధించుకున్న పరిమితి కావచ్చు. ఈ పదిమంది పోలీసులకు మార్గదర్శకత్వం వహించి, వారిచేత ఈ పని చేయించి జేజేలు అందుకున్న రాజకీయ నాయకులు గానీ, పోలీసు అధికారులు గానీ ఈ జాబితాలో లేరు. ఈ సంఘటనలో మరణించిన నలుగురు ఎదురు దాడి చేశారనేది అసంభవమైన ఆరోపణే కాక పూర్తిగా అబద్ధమని కమిషన్ అభిప్రాయ పడింది. ప్రస్తుత ఘటనలో మరణించిన నలుగురి శరీరాల పైభాగంలో, తల మీద తుపాకీ గాయాలు ఉన్నాయి. ఈ వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తున్నవారినే ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని నమ్మడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కాల్పుల స్వభావం వాటి ఉద్దేశాలను నిర్ధారిస్తుంది అనే ఒక ముఖ్యమైన సూత్రీకరణ చేసింది కమిషన్. ఇది కాల్పుల సంఘటనలో ఉద్దేశాలను అంచనా వేయడానికి పనికి వచ్చే ఒక ప్రమాణం. పియుసిఎల్ వర్సెస్ స్టేట్ అఫ్ మహారాష్ట్ర కేసులో సర్వోన్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పును తాము పాటించామని తెలంగాణ రాష్ట్రం చేసిన వాదనను కమిషన్ అంగీకరించలేదు. దాని ఉల్లంఘన అడుగడుగునా జరిగినట్లు కమిషన్ పేర్కొంది. మొదటగా, చంపబడే నాటికి జొల్లు శివ, చెన్నకేశవులు, జొల్లు నవీన్‌ల వయసు వరుసగా 17, 15, 15 ఏళ్లు అని కమిషన్ తేల్చింది. ఆధార్ కార్డు ఆధారంగా వాళ్ళ వయసు 18 ఏళ్ల కన్నా ఎక్కువ అని వాదించిన ప్రభుత్వ వాదనను కమిషన్ తోసిపుచ్చింది. వారు చదువుకున్న బడి పంతుళ్లు రికార్డులను తారుమారు చేశారనే వాదనను కమిషన్ అంగీకరించలేదు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన నాలుగు రోజులకు పోలీసులు వచ్చి స్కూలు రికార్డులు పరిశీలించి వెళ్లారు, కాబట్టి ఆ ముగ్గురి వయస్సు మీద వారికి ఎటువంటి సందేహం లేదు. అయినా ఈ నిజం మీద పోలీసు రికార్డులు పూర్తి మౌనం వహించాయి. కాబట్టి ఇదంతా వాళ్ళు మైనర్లు అనే నిజాన్ని ప్రయత్నపూర్వకంగా తొక్కిపెట్టడానికి చేసిన ప్రయత్నమనే నిర్ధారణకు రాక తప్పదని కమిషన్ వ్యాఖ్యానించింది. కమిషన్ ముందు వాదనలు జరుగుతున్న రోజుల్లో పోలీసుల తరపున వకాల్తా పుచ్చుకున్న ప్రభుత్వ న్యాయవాదులు ఇంకొక ప్రభుత్వ శాఖ అయిన విద్యాశాఖ మీద, అందులోని ఉపాధ్యాయుల మీద తప్పుడు సాక్ష్యాలు ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. దీనిపై వ్యాఖ్యానిస్తూ కమిషన్ స్కూలు రికార్డుల విశ్వసనీయతను ప్రభుత్వమే ప్రశ్నించడం ఆసక్తికరం అన్నది. పోలీసులను వెనకేసుకు రావడానికి ప్రభుత్వం ఎంత దూరం వెళుతుందో అర్థం చేసుకోడానికి ఇది పనికి వస్తుంది. నలుగురు నిందితులను రిమాండుకు పంపిన ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ పనితీరు మీద కమిషన్ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పోలీసులు ముందుగా తయారు చేసిన రిమాండు రిపోర్టు మీద ఆయన సంతకం చేసాడని, వాళ్ళను ఎప్పుడు, ఏ సమయంలో నిర్బంధంలోకి తీసుకున్నారో ఆయన పరిశీలించలేదని, చట్టం ప్రకారం ఆయన చేయాల్సిన రికార్డుల పరిశీలన చేయలేదని, నిందితులకు ఉన్న హక్కుల గురించి చెప్పలేదని స్పష్టం చేసింది. ఈ విధులను నిర్వర్తించని పక్షంలో ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు మీద చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కమిషన్ ఈ సందర్భంగా గుర్తు చేసింది. జుడీషియల్ రిమాండు విధించే అధికారం ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటుకు ఉండటానికి వీలు లేదని సిఫారసు చేసింది. ఇది పోలీసు వ్యవస్థకు అతీతంగా వ్యవహరించని రెవెన్యూ యంత్రాంగం పనితీరు మీద వ్యాఖ్యానంగా పరిగణించాలి. అదే విధంగా నిందితులను డిసెంబరు 2, 2019న పోలీసు కస్టడీకి ఇచ్చిన అదనపు సివిల్ జడ్జి పనితీరు గురించి చాలా చర్చించింది కమిషన్. కస్టడీకి ఇవ్వాలని కోరిన పోలీసులు న్యాయమూర్తి ముందు ఎటువంటి పత్రాలు సమర్పించలేదు. ఆయన కూడా వాటిని సమర్పించాలని ఒత్తిడి చేయలేదు. జైలు రిమాండు విధించిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు ఆదేశాన్ని మాత్రమే న్యాయమూర్తి పరిశీలించాడు (ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు ఎంత బాధ్యతాయుతంగా రిమాండ్ విధించాడో పైన చూసాం). ఈ సందర్భంగా ఏ పోలీసు అధికారి కోర్టుకు హాజరు కాలేదు. కోర్టు కానిస్టేబుల్ మాత్రమే పోలీసు కస్టడీ పిటిషన్ సమర్పించాడు. నిందితులకు నోటీసు ఇచ్చారా అని న్యాయమూర్తి అడగలేదు. ఇంకా దిగ్భ్రాంతికరమైన విషయమేమంటే ప్రభుత్వ న్యాయవాది కూడా హాజరు కాలేదు. అయినా ‘వాదనలు వినడమైనది’ అని రిపోర్టులో న్యాయమూర్తి రాశాడు. నలుగురు నిందితులను ఆయన ముందు అసలు అసలు ప్రవేశపెట్టనే లేదు, అయినా పిటిషన్‌లో నిందితుల సంతకాలు ఉన్నాయి. న్యాయ వ్యవస్థ నిర్వాకం గురించి కమిషన్ ఆశ్చర్యపోయింది. కానీ నిజానికి నిందితులు జైల్లో ఉండగానే వారి పరోక్షంలో, వారికి నోటీసులు ఇవ్వకుండా, వారి తరపున న్యాయవాదులే లేకుండా పోలీసు రిమాండు ఇచ్చే దుర్నీతిని పేద నిందితుల విషయంలో న్యాయస్థానాలు చాలా కాలంగా కొనసాగిస్తున్నాయి. చట్టబద్ధ పాలనపైన విశ్వాసం న్యాయస్థానాలకే లేకపోతే, వాటి పనితీరుకు విశ్వసనీయత ఎక్కడ నుండి వస్తుంది? ఈ విశ్వసనీయత ఎంత తగ్గిపోతుంటే అంతగా నేరస్థుల పట్ల తక్షణ కఠిన వైఖరి (దీనికి ‘తక్షణ న్యాయం’ అని ముద్దు పేరు పెట్టుకున్నారు) ప్రదర్శించే హక్కు ప్రభుత్వానికి ఉండాలని వాదించే గళాలు పెరిగిపోతున్నాయి. ఇదంతా ప్రభుత్వాల నియంతృత్వానికి, కనీసం బలహీనుల విషయంలో, దారితీస్తుంది. సంఘటనా స్థలానికి ఎప్పుడు చేరుకున్నారు అనే విషయంలో ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టించడానికి పోలీసులు ప్రయత్నించారని కమిషన్ వ్యాఖ్యానించింది. నిందితులు చంపబడ్డ సమయానికి సంబంధించి ఘటనలో పాల్గొన్న పోలీసుల వాదనకు, పంచనామా నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఇచ్చిన సమాచారానికి, ఆ తర్వాత పోలీసుల పరిశోధనలో తేలిన విషయాలుగా ప్రకటించిన వాటికి మధ్య పొంతనే లేదనే నిర్ణయానికి కమిషన్ వచ్చింది. ఇంత ప్రాథమికమైన విషయంలో మొత్తం యంత్రాంగం ఎందుకు విఫలమైనట్టు? ఏమి దాచిపెట్టడానికి ఈ వైఫల్యాన్ని ప్రదర్శించారు? తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణాలో వేల ఎదురు కాల్పులు జరిగాయి కదా? అవన్నీ వాస్తవంగా జరిగిన ఘటనలే అని వాదిస్తూ వచ్చారు కదా? ఈ ఒక్క ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్ ఘటన మీద, నేర న్యాయ వ్యవస్థలో 40 నుంచి 50 ఏళ్ల అనుభవం ఉన్న న్యాయమూర్తుల విచారణ జరగగానే, ఇన్ని అబద్ధాల కంకాళాలు బయట పడ్డాయంటే, ఇంతకాలం పోలీసు వ్యవస్థ ఏమి చేసినట్టు? చనిపోయిన నిందితుల దాడిలో గాయపడిన ఇద్దరు పోలీసులు కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందారనే వాదనను కమిషన్ చాలా శ్రద్ధగా పరిశీలించింది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి మెడికో లీగల్ రికార్డులు మాత్రమే మొదటగా పోలీసులు అందించారు. చికిత్సకు సంబంధించిన ఒరిజినల్ రికార్డులను కేర్ హాస్పిటల్ ఇవ్వడానికి నిరాకరించిందని పరిశోధనాధికారి చెప్పారు. కానీ కేర్ హాస్పిటల్ వర్గాలు మొదటగా మొత్తం రికార్డులను జాతీయ మానవ హక్కుల సంఘానికి ఇవ్వడానికే నిరాకరించి, ఆ తర్వాత కొంత ఇచ్చాయి. ఆ తర్వాత సోమయ్య అనే అధికారికి ఇచ్చినట్టు కమిషన్ ముందు చెప్పాయి. జుడీషియల్ మేజిస్ట్రేటు కూడా తాను డాక్టర్లు ఇచ్చిన, గాయపడిన వారి మొత్తం రికార్డులను పరిశీలించి మొత్తం సవ్యంగా ఉన్నట్టు భావించానని కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చింది. కానీ గాయపడ్డారన్న పోలీసులను మేజిస్ట్రేట్ ప్రత్యక్షంగా విచారించలేదని, తాము చెప్పిన విషయాలను ఎఎస్ఐ రికార్డు చేసుకుని మేజిస్ట్రేటుకు ఇచ్చారని, గాయపడ్డామన్న పోలీసులు చివరకు అంగీకరించారు. చివరకు కమిషన్ ఒత్తిడి చేయగా, అందించిన సీటీ స్కాన్, ఎక్స్‌రేలకు, పోలీసులు తమకు తగిలాయని చెప్పిన గాయాలకు ఎక్కడా పొంతన లేదని కమిషన్ పేర్కొంది. ఇద్దరు పోలీసులకు కేర్ హాస్పిటల్ ఐసియులో చికిత్స చేశారనే వాదనను సందేహించాల్సి వస్తుందని, ఎందుకంటే వారికి తగిలిన గాయాలకు హాస్పిటలులో చేర్చాల్సిన అవసరమే లేదని కమిషన్ అభిప్రాయపడింది. నిందితులైన పోలీసులు తమపై వచ్చిన అభియోగాలను కోర్టులలో తేల్చుకుంటాం అని ప్రకటించారు. ఆ అవకాశాన్ని దిశా కేసులో నిందితులకు వ్యవస్థ, మీడియా, సమాజం ఇచ్చిందా? తమ వాదన వినకుండా శిక్షించకూడదు అనే సూత్రం మీద మనకు నిజంగా విశ్వాసం ఉందా? లేదా ఆచరణలో బలవంతులకు మాత్రమే ఉందనే ధీమానా? జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ నివేదికను బట్టి పోలీసు వ్యవస్థ మనసెరిగి పనిచేయడానికి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు, జుడీషియల్ మేజిస్ట్రేటు, డాక్టర్లు, కార్పొరేట్ ఆస్పత్రులు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గెస్ట్‌హౌసుల యజమానులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఫోరెన్సిక్ నిపుణులు చాలా సంసిద్ధంగా ఉన్నారని అర్థమౌతుంది. సకల సంస్థలు పోలీస్ యంత్రాంగానికి గులాంగిరి చేస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందనగలమా? గుడిగండ్ల గ్రామ బడిపంతులు నరసింహులు మాత్రమే మిణుకు, మిణుకు అనే సత్యం వైపు బలంగా నిలబడ్డాడు. ఆయనకు సెల్యూట్.

## ప్రోత్సాహం కరువైన ప్రజానాయకులు



ప్రజానాయకుడు అంటే లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్. దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి నియంతృత్వ పోకడలను ప్రజలు ప్రోత్సహించరని నిరూపించిన జన నేత. దేశంలో కార్మికులందర్నీ సంఘటితపరచి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహానేత జార్జి ఫెర్నాండెజ్. ప్రజానాయకులు ఒక పిలుపునిస్తే వేల మందిని సమీకరించే శక్తి ఆ పిలుపునకు ఉండేది. కానీ నేడు ప్రజానాయకులు కరువయ్యారు. దేశంలోని ఏ పార్టీ కూడా కుల, వారసత్వ రాజకీయాలకు అతీతంగా లేదు. పార్టీలన్నీ ఒకే విధంగా వ్యవహరిస్తున్నాయి. సహజసిద్ధంగా వచ్చేవారిని, ఉద్యమ నాయకులను ప్రోత్సహించడం లేదు. ఎన్నికలు వస్తే నువ్వు ఎంత ఖర్చు పెడతావు అని టిక్కెట్లు ఆశిస్తున్న వారిని ప్రతి రాజకీయ పార్టీ అడుగుతోంది. సమాజంలో మంచి పేరు ప్రతిష్ఠలుండి, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి, సమస్యల పరిష్కారానికి కృషి చేసినా, కోట్ల రూపాయల డబ్బు ఖర్చు పెట్టే శక్తి లేకపోతే వారికి ఏ పార్టీ కూడా బి-ఫారం ఇచ్చే పరిస్థితి లేదు. అలాగే నేతల వారసులే రాజకీయ నాయకులు అవుతున్నారు. ఈ వారసత్వ రాజకీయం అన్ని పార్టీలలోనూ ఉంది. సహజసిద్ధంగా, స్వతహాగా వచ్చిన వారిని ఎదగనీయకుండా ఈ వారసులు అణగదొక్కుతున్నారు. ప్రతి పార్టీలో బలమైన నాయకులను గుర్తించి వారిని నయానో, భయానో, కాంట్రాక్టుల ఆశ చూపి ప్రత్యర్థి పార్టీల వాళ్ళు చేర్చుకుంటున్నారు. వారికే ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తున్నారు. ఈ విధంగా చేయడం వల్ల పార్టీ ఏదైనా అతనే నేతగా కొనసాగుతున్నాడు. అప్పటివరకు ఆ పార్టీలో నిబద్ధత, క్రమశిక్షణతో జెండా మోసిన నాయకులను విస్మరిస్తున్నారు. వేరే వారికి మద్దతు ఇచ్చి, డబ్బులు ఇచ్చి ఎన్నికల్లో నిలబెట్టడం ఎందుకు నేనే పోటీ చేస్తే నయం కదా అనుకుంటూ వ్యాపారస్తులే రాజకీయ నాయకులుగా మారుతున్నారు. ఇలా నాయకులుగా ఎదిగినవారు ప్రజల్ని పీడిస్తున్నారు. ఒరిస్సాలోని పార్లమెంట్ సభ్యుడు ప్రతాప్ సారంగి, తెలంగాణలోని ఇల్లందు నుంచి అనేక పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మడి నర్సయ్య... ఇంకా అనేకమంది ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలిచినా పక్కా భవనాలు కూడా నిర్మించుకోలేదు. వ్యాపారాలు చేయలేదు, నయాపైసా సంపాదించుకోలేదు. ఇలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని టిక్కెట్లు కేటాయించే పరిస్థితి రాజకీయ పార్టీలలో ఉన్నదా? అని ప్రజా ఉద్యమ నాయకులు, యువత ప్రశ్నించాలి. ప్రజలు కూడా డబ్బు తీసుకోకుండా నీతి నిజాయితీతో ఓటు వెయ్యాలి. నిజమైన నాయకులకు అన్యాయం జరిగితే పార్టీలను ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి. అప్పుడే వారసత్వ, వ్యాపార, సంపన్న, కుల రాజకీయాలకు స్వస్తి పలుకగలుగుతాం.

# తెలంగాణ రైతాంగానికి కేంద్రప్రభుత్వం చేసిందేమిటి?

స్వార్థ రాజకీయాలతో ధాన్యం కొనుగోళ్లలో సమస్యలే

రైస్ మిల్లుల్లో ఎఫ్ సీ ఐ తనిఖీల పేరుతో ఒరిగిందేమిటి?

ధాన్యం నిల్వలకు రైస్ మిల్లుల్లో జాగా ఏదీ?

కొనుగోళ్లకు తంటాలు... తరలింపుకు ఎదురుచూపులు

ఏఐఎఫ్ బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి

కరీంనగర్ మే 24 ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణ రైతాంగానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నష్టమే తప్ప మేలు చేసిందేమీ లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి దుయ్యబట్టారు. తెలంగాణ లోని టీఆర్ఎస్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు తమ స్వార్థ రాజకీయాలతో ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు తెచ్చి రైతులను నానా అవస్థలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రా రైస్ మాత్రమే తీసుకుంటామని కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ డ్రామాలు ఆడి చి'వరి'కి సాధించిందేమిటని ప్రశ్నించారు.. చివరికి మేమే కొంటామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా ముందస్తు ప్రణాళిక లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. దానికంతటికీ ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ యేనని మండిపడ్డారు... కొనుగోళ్ల ప్రక్రియ మొదలు పెట్టగానే రైస్ మిల్లుల్లో కేంద్ర ప్రభుత్వం గత సీజన్లలోని వడ్లు, బియ్యంపై ఎఫ్ సీ ఐ తనిఖీలు చేపట్టిందని, రాష్ట్రమంతటా రెండు వేలకు పైగా ఉన్న మిల్లుల్లో చేసిన తనిఖీలతో ఒరిగిందేమిటని ప్రశ్నించారు.. అందుకు తెలంగాణ రాష్ట్రంలోని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పదే పదే తెలంగాణ ప్రభుత్వంపై నిందారోపణల కంటే రైతాంగానికి చేసిందేమిటని ప్రశ్నించారు. రైస్ మిల్లుల్లో అవినీతి జరిగి ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని, సీబీ ఐ దాడులు చేయడానికైనా సిద్ధమైతే ఎందుకు వెనుకడుగు వేశారని ప్రశ్నించారు?.. కేంద్ర స్వార్థపూరిత రాజకీయాల ఫలితంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యమయ్యిందని, ఒకే సారి ధాన్యం రావడంతో కాంటాలు కావడం, గన్నీలు, టార్పాలిన్లు, లారీలు, వాహనాల నుంచి తరలింపు సమస్యతో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. మరో వైపు రారైస్ లో నూకల శాతంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో మిల్లర్లు సైతం వెనుకడుగు వేశారన్నారు. ఒత్తిడితో మిల్లుల్లో దించుకుంటున్నా తరుగు పేరుతో రైతుల నుంచి దోచుకుంటున్నారని తెలిపారు.. ధాన్యం కొంటున్నా...రైస్ మిల్లుల్లో జాగాలేదన్నారు. గోడౌన్‌లలో సందు లేదని, గత వానాకాలం ధాన్యానికి తోడు ఈ యాసంగి ధాన్యం కూడా వచ్చి చేరుతుండడంతో జాప్యం జరుగుతోందన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు చేసి వాహనాల ద్వారా తరలించినా.. మిల్లులో జాగాలేకపోవడం వల్ల ధాన్యం బస్తాలు దించుకోవడం లో యజమానులు చేతులెత్తేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 550 మిల్లులకు పైగా ఉండగా కరీంనర్ జిల్లాలోనే 180 రారైస్, బాయిల్డు రైస్ మిల్లులున్నాయన్నారు. గత రబీ సీజన్ లో 10 శాతం, ఖరీఫ్ సీజన్ లో 40 శాతం ధాన్యం రైస్ మిల్లుల్లోనే ఉన్నాయని, ఈ రెండు సీజన్లు కలిపి ఇప్పటి వరకు 1 లక్ష టన్నుల వరకు రైస్ మిల్లుల్లోనే ఉండగా ఎఫ్ సీ ఐ తీసుకోలేదని తెలిపారు. రెండు పంటల కాలం పూర్తయిపోయాక కూడా రైతుల నుంచి సేకరించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలు పేరుకుపోవడం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యమేన న్నారు. ట్రాన్స్ పోర్టు లారీలు, రైల్వే ర్యాకులు, స్టోరేజీ కొరత వేధిస్తోందని, అంతిమంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్వార్థ రాజకీయాలతో రైతులతో చెలగాటమాడడం తగదన్నారు. కుల మత రాజకీయాలతో రైతు ప్రభుత్వమని చెప్పుకోకూడదని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతులపై వివక్ష చూపడం తగదని, ఫలితంగానే రైతు ఉద్యమాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో రైతులే తగిన గుణపాఠం చెబుతారని ప్రశ్నించారు.

## ఏసీపీ కరుణాకర్ రావు టీఎన్జీఓ సన్మాం

కరీంనగర్ మే 24 ప్రజాపాలన ప్రతినిధి :కరీంనగర్ రూరల్ ఏ సీ పీ గా పదవి భాద్యతలు చేపట్టిన తాండ్ర కరుణాకర్ రావును కరీంనగర్ జిల్లా టి ఎన్జిఓ నాయకులు స్వాతం పలుకి పలికి శాలువాో సత్కరించారు. ఈ సందర్బంగా తెలంగాణ ఉద్యమము "సకల జనుల సమ్మె "నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు ఈ కార్యక్రమములో జిల్లా టి ఎన్జి ఓ అధ్యక్ష కార్యదర్శులు మారం జగదీశ్వర్ దారం శ్రీనివాస్ రెడ్డి ముప్పిడి కిరణ్ కుమార్ రాగి శ్రీనివాస్ గూడా ప్రభాకర్ రెడ్డి రాజేష్ భరద్వాజ్ మనిమిత్ సింగ్ కోట రామస్వామి నగేష్ గౌడ్ రాకేష్ ప్రణీత్ తదితర నాయకులు పాలుగోన్నారు.

## నిరంతరం ప్రజా శ్రేయస్సుకై పోరాడిన నాయకుడు నల్లమల్ల



బోనకల్, మే 24 ప్రజాపాలన ప్రతినిధి: పేదల ప్రజల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేసిన మహోనీయుడు నల్లమల్ల గిరిప్రసాద్ అని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కొనియాడారు. మండలంలోని రాయన్నపేట గ్రామంలో మంగళవారం 25వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యం గల ఆనందరావు మాట్లాడుతూ.. అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా నల్లమల్ల గిరిప్రసాద్ నాయకుడిగా పార్టీ నిర్మాణంలో అవిరామంగా కృషి చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గిరిప్రసాద్ పాత్ర ప్రత్యేకమైనదన్నారు. ఆయన జీవిమంతా ప్రజా ఉద్యమాలకే అంకితం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తూము రోషయ్య, కొంగర రామారావు,ఏలూరి పూర్ణచంద్, మరీదు ఈశ్వరమ్మ, మరీదు వెంకటేశ్వర్లు, తోటపల్లి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## "ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ గా" రేగుంట మహేష్ ఎన్నిక"



ఆసిఫాబాద్ జిల్లా మే 24 (ప్రజాపాలన, ప్రతినిధి) : ఎమ్మార్పీఎస్ కేబీ ఆసిఫాబాద్ జిల్లా కో కన్వీనర్ గా రేగుంట మహేష్ మాదిగ ను సోమవారం ఎన్నికైనట్లు మంగళవారం రేగుంట మహేష్ మాదిగ విలేకరులతో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా కో కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించి నియమించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ లకు కృతజ్ఞతలు తెలిపారు. నా నియామకానికి సహకరించిన జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ, నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మాదిగల చిరకాల ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తూ జిల్లావ్యాప్తంగా మాదిగలను ఏకం చేసి నిరంతరం పనిచేసి రాష్ట్రంలోనే జిల్లాను ఉద్యమములో ప్రథమ స్థానంలో ఉండే విధంగా నా వంతు కృషి చేస్తానని అన్నారు.

## ఘనంగా గిరి ప్రసాద్ 25వ వర్ధంతి



మధిర రూరల్ మే 24 ప్రజా పాలన ప్రతినిధి మండలం పరిధిలో భారత కమ్యూనిస్టు పార్టీ %ఎజూఅ% జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ మధిర ప్రాంతవాసి అమరజీవి కామ్రేడ్ లినల్లమల గిరి ప్రసాద్ లి 25 వ వర్ధంతి సందర్భంగా గిరి ప్రసాద్ గారి సొంత గ్రామమైన మధిర మండలం తొండల గోపారం లో సిపిఐ మధిర మండలం సమితి ఆధ్వర్యంలో గిరి ప్రసాద్ వర్ధంతి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా గిరి ప్రసాద్ స్మారక స్థూపం వద్ద లిసిపిఐ మధిర మండల సహాయ కార్యదర్శి చావా మురళీకృష్ణలి జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అదేవిధంగా గిరి ప్రసాద్ స్మారకస్థూపం కి లిసిపిఐ మధిర పట్టణ కార్యదర్శి బెజవాడ రవి బాబు లి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరి ప్రసాద్ విగ్రహానికి లిసిపిఐ మండల కార్యదర్శి ఓట్ల కొండలరావు పట్టణ సహాయ కార్యదర్శి పెరుమలపల్లి ప్రకాశరావులి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం లిసిపిఐ మధిర పట్టణ మండల కార్యదర్శి లు బెజవాడ రవి బాబు ఓట్ల కొండలరావు మాట్లాడుతూ అప్పటి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ధృవతారగా వెలుగొందిన గిరిప్రసాద్ జీవితం, ఆయన చేసిన త్యాగం నేటి తరం కార్యకర్తలకు, నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాలను నడిపించడంలో కీలకపాత్ర పోషించిన గిరిప్రసాద్ లేని లోటును పరిపూర్తి చేయాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. నిజాం నిరంకుశపాలనకు వ్యతిరేఖంగా ఆంధ్ర మహాసభ సాగించిన ఉద్యమం గురించి అధ్యయనం చేసి ఉన్నత విద్యను, ఆస్తులను సైతం వదిలివేసి ఉద్యమబాట పట్టిన నల్లమల సాయుధ పోరాటాన్ని బలోపేతం చేశాడని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన గిరిప్రసాద్ జిల్లా అభివృద్ధికి, పేదల సంక్షేమంకోసం నిరంతరం కృషి చేయాడన్నారు. అయన చూపిన పోరాట మార్గంలో పయనిస్తూ నమ్మిన సిద్ధాంతాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించిన వాళ్లమవుతామని అన్నారుఈ వర్ధంతి కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ఏఐటీయూసీ మధిర డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు రైతు సంఘం మండల అధ్యక్షులు పంగా శేషగిరిరావు మండల కార్యవర్గ సభ్యులు వుట్ల కామేశ్వరరావు మంగళగిరి రామాంజనేయులు సిరి వేరు శ్రీను %ంఎ%. కొండ తొండల గోపారం గిరి ప్రసాద్ అభిమానులు సత్యనారాయణ వెంకటేశ్వరరావు కృష్ణయ్య వెంకట్ నారాయణ తదితరులు నివాళులర్పించారు.

## అర్హులైన జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ భారతి హొళికేరి



మంచిర్యాల బ్యూరో, మే 24, ప్రజాపాలన: జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులు అక్రిడేషన్ కార్డు కొరకు తమ దరఖాస్తులను ఆన్లైన్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ భారతి హొళికేరి ఒక ప్రకటనలో తెలిపారు. 2022-24 సంవత్సరానికి గాను అక్రిడిటేషన్ కార్డుల జారీకి పాత్రికేయుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని, 2019 సంవత్సరంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు జూన్ 30వ తేదీ నాటికి ముగుస్తున్న దృష్ట్యా నూతన అక్రిడిటేషన్ కార్డుల జారీకి అర్హులైన జర్నలిస్టులు ఈ ఈ నెల 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు సమాచారశాఖ ఆన్లైన్ వెబ్సైట్ https:/ipr.telangana.gov.inను సందర్శించి మెనూ క్రింద చూపించే Media Accreditation లింక్ను క్లిక్ చేసి జర్నలిస్టుకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు. చేయాలని, అట్టి ప్రతులను జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ప్రభుత్వ జీ.ఓ. నం.239 ప్రకారం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం మేరకు అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రైతు కల్లాల నుండి ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి



మంచిర్యాల బ్యూరో, మే24, ప్రజాపాలన :రైతు కల్లాల నుండి వరిధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రవాణ అధికారి కిష్టయ్య, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడుచున్నందున కల్లాల నుండి నాణ్యమైన వరిధాన్యంను కొనుగోలు కేంద్రాలకు, అక్కడి నుండి రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు లారీల యజమానులు పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు. ప్రతి రోజు 362 లారీలు ధాన్యం తరలింపులో పాల్గొనాలని, రైసిమిల్లర్లు కేటాయించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో తీసుకోవాలని తెలిపారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా జిల్లాలో వరిధాన్యంను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసి ధాన్యం తడవకుండా నిల్వ చేస్తూ త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిల్లులకు ధాన్యం తీసుకువచ్చే లారీల నుండి అన్లోడింగ్ను వేగంగా చేసి లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు 14 కుట్టుమిషన్లు పంపిణీ..



ఖమ్మం, మే 24 (ప్రజాపాలన న్యూస్): ఖమ్మంజిల్లా ఖమ్మం పట్టణంలోని మోతినగర్ జె యస్ యస్ సెంటర్ ద్వారా ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన లబ్దిదారులకు గరికపాటి వెంకటరావు ఆర్థిక సహాయంతో 14 కుట్టు మిషన్స్ మాజీ పార్లమెంట్ మెంబర్ శ్రీ తమ్మినేని వీరభద్రం ద్వారా లబ్ధిదారులకు కుట్టు మెషన్స్, సర్టిఫికెట్స్ అందజేయడం జరిగిందని జన శిక్షణ సంస్థాన్ ఖమ్మం జిల్లా డైరెక్టర్ వై. రాధాకృష్ణ తెలియజేశారు. ఈ సందర్భంగా తమ్మినేని, ఎర్రా శ్రీకాంత్, చేతన ఫౌండేషన్ అధ్యక్షులు పసుమర్తి రంగారావు, రాధాకృష్ణ, నున్న రమణ, లింగయ్య, ఐద్వా నాయకురాలు పద్మ, మహిళమండలి అధ్యక్షులు యస్కె రజియా, 35వ డివిజన్ కార్పొరేటర్ వెంకట్రావు డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ మహిళలు స్వయం శక్తితో ఎదగాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అన్నిరంగాలలో ముందడుగు వేయాలని, శ్రీసిటీ అధినేత ద్వారా అందించిన ఆర్థిక సహాయం చాలా గొప్పది అని ఇంత పెద్ద మొత్తంలో సహాయం అందించిన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జె యస్ యస్ స్టాఫ్,రిశోర్స్ పర్సన్స్ నాగమణి,ప్రశాంతి కవిత, జాస్మిన్, జాన్సీ, కిరున్నిసా బేగం,మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానముతో సమానం



నస్పూర్, మే 24, ప్రజాపాలన ప్రతినిధి: రక్తదానం చేయడం ప్రాణదానముతో సమానమని శ్రీరాంపూర్ సింగరేణి ఎంవీటీసీ మేనేజర్ కే వీ. రామారావు అన్నారు. మంగళవారం తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల రక్త నిధి కేంద్రం, సింగరేణి ఎంవీటీసీ శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. ఈ శిభిరాన్ని సింగరేణి ఎంవీటీసీ మేనేజర్ కేవీ. రామారావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలస్సేమియా సికిల్ సెల్ వ్యాది గ్రస్తులకు ప్రతి 15 రోజులకు ఒక్కసారి రక్తాన్ని ఎక్కించ వలసి వస్తుంది, ప్రస్తుతం వేసవి కాలం కావడం తో తలస్సెమియా సికిల్ సెల్ పిల్లలకు, గర్భిణిలకు, అత్యవరస సమయంలో ఉన్న వారికి రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రక్తదానం చేసిన వారిని అయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ రక్తదాన శిబిరంలో 41 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, టీజీబీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, తలస్సెమియా వెల్ఫేర్ సొసైటి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, వైద్యులు డా. రంజిత్ కుమార్, రక్త నిధి సిబ్బంది పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూసుకోవాలి



నస్పూర్, మే 24 ప్రజాపాలన ప్రతినిధి: వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని అడ్వైజర్ మైనింగ్ డిఎన్.ప్రసాద్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ సూర్యనారాయణలు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని ఉపరితల గనిలో నిరంతరం బొగ్గు ఉత్పత్తి రవాణా చేయాలని దానికి సంబంధించి అన్ని ప్రణాళికలను ముందస్తుగా చేసుకొని దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. సుశి కాంట్రాక్టు కాలపరిమితి ముగుస్తున్నందున దానికి అనుగుణంగా కొత్త కాంట్రాక్టు ఇవ్వడానికి అవసరమైన చర్యలపై సమీక్షించారు. బొగ్గు నిల్వలు, బొగ్గు రవాణాకు సంబంధించిన అంశాలపై చర్చించారు. క్వారీ నడపడానికి అవసరమైన, డంపింగ్ చేయడానికి కావలసిన ఆర్ అండ్ ఆర్ గ్రామాల తరలింపు ప్రదేశాలను ప్రత్యక్షముగా పరిశీలించి భవిష్యత్తు ప్రణాళికలను రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవ రెడ్డి, ఎస్ఓ టూ జీఎం గుప్తా, శ్రీరాంపూర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి.పురుషోత్తమ రెడ్డి, ఇందారం సీ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేశ్వర్ రెడ్డి, గని మేనేజర్ కే.జనార్ధన్, ఇన్చార్జి క్వాలిటీ కే.వెంకటేశ్వర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, గని సర్వే అధికారి సంపత్ పాల్గొన్నారు.

# దళితుల శ్మశాన వాటిక కబ్జా కు గురి కాకుండా ఉండాలని అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం



బోనకల్, మే 24 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని గోవిందపురం (ఎల్ )గ్రామానికి చెందిన వారు మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ రావు కి వినతి పత్రం ఇవ్వటం జరిగినది. గోవిందపురం (ఎల్ )గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దళితుల స్మశాన వాటిక స్థలం కొందరి ఆక్రమణకు గురి అవుతున్నందున సంబంధిత రెవెన్యూ అధికారుల చే సర్వే చేపించి స్మశాన వాటిక స్థలం కబ్జాకు గురికాకుండా ఉండేందుకు, ఇట్టి స్థలములో కొందరు పెద్దలు కావాలని ,గత మూడు సంవత్సరాలుగా ఈ స్థలంపై కన్నేసి దళితులకు చెందకుండా, దళితులకు స్మశాన వాటిక స్థలం అవసరమా అంటూ ఎవరైనా చనిపోతే పూడ్చి పెట్టే పద్ధతి సరైనది కాదని లేనిపోని మాటలతో అధికారులను ఒప్పించి ఈ స్థలాన్ని కాజేసేందుకు కుట్ర జరుగుతున్నది. గత 70 సంవత్సరాల కు పైగా ఈ స్థలంలో దళితులు ఎస్సీ మాదిగ కులానికి చెందిన వారు ఎవరో చనిపోయిన పూడ్చి పెట్టి వారి సాంప్రదాయం ప్రకారం కొందరు సమాధులు నిర్మించుకుంటున్నారు ఇది తరతరాలుగా ఎస్సీలు ఈ ఆనవాయితీని పాటిస్తూ వస్తున్నారు. ఎస్సీ కాలనీలో లో సుమారు గా 450 కుటుంబాలు పదిహేను వందల మంది జనాభాతో ఉన్న దళితవాడ సంవత్సరం సంవత్సరం అభివృద్ధి చెందుతూ పెద్ద కాలనీగా రూపాంతరం చెందుతున్నది. ఇప్పటికీ నా భూమిలో సుమారు గా ఎకరం కు పైగా సమాధులు నిర్మించబడి ఉన్నాయి. మిగిలిన కొద్దిపాటి స్థలంలో సుమారు రెండు ఎకరాలు పొలం ఉంటే తప్ప స్మశాన వాటిక స్థలం సరి పోయే పరిస్థితి లేదు. ప్రభుత్వ జీవో ను అనుసరించి జీవో నెంబర్ 1235 ప్రకారం ప్రతి దళితవాడకు రెండెకరాల స్మశాన వాటిక స్థలం కొని ఇవ్వాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. కానీ ఇక్కడ కొందరు పెద్దలు కావాలని ఉన్న స్థలాన్ని కాజేసేందుకు ఎలాగైనా ఈ స్థలంలో ఏదో ఒకటి నిర్మించి స్థలం కాజేసేందుకు పావులు కదుపుతున్నారు . ఈ స్మశాన వాటిక స్థలం కోసం గత మూడు సంవత్సరాలుగా ఎస్సీ కాలనీకి చెందిన పెద్దలు యువత ప్రజా ప్రతినిధులు అధికారులను కలిసి సర్వే చేయించమని కోరగా 3 సంవత్సరాల క్రితం అప్పటి సర్వేయర్ కోట వెంకటరత్నం తో సర్వే చేయించినారు. ఆ సర్వే రిపోర్టు రాకుండా కొందరు అడ్డుపడి అధికారులను తప్పుదోవ పట్టించి సర్వే రిపోర్టుఇవ్వకుండా ఆపినారు. మరల ఇప్పటి తాసిల్దారు రావూరి రాధిక ఎస్సీ కాలనీకి చెందిన యువత కలిసి దరఖాస్తు సమర్పించి సర్వే చేపించి మాకు హక్కు కల్పించగలరని కోరినారు. కానీ నేటి వరకు కు సర్వే చేయించకుండా కాలయాపన చేస్తున్న విషయమై తాసిల్దార్ దృష్టికి కేసు పెట్టడం జరిగినది. గత 5 సంవత్సరాల క్రితం స్మశాన వాటిక స్థలం వద్ద మసీదు వెనక భాగంలో లో ప్రహరి నిర్మిస్తుండగా కాలనీ పెద్దలు అచ్చటకు వెళ్లి ప్రహరి మా స్థలం లోకి వస్తే బాగోదు అని చెప్పి ముస్లిం పెద్దల తో మాట్లాడి బౌండరీ దాటి రాకుండా అందరూ కలిసి కంచె వేసి స్మశాన వాటిక స్థలం కాపాడు కోవడం జరిగింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలెక్టర్ చొరవ తీసుకుని రెవెన్యూ అధికారులతో మాట్లాడి సర్వే చేయించి గ్రామపంచాయతీ తీర్మానంతో గత 70 సంవత్సరాలుగా మా స్వాధీనంలో ఉన్న వేము సమాధులు నిర్మించుకున్న స్థలం మసీదు వెనకభాగం నుండి ఆదూరి ప్రసాద్ పొలం వరకు హద్దులు నిర్ణయించి ఉన్న స్థలం మొత్తం ఎప్పటిలాగానే మాకు మా స్మశాన వాటికకు కేటాయించాలని దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డులో దళితుల స్మశాన వాటిక పేరుతో నమోదు చేయాలని కలెక్టర్ని కోరారు.

అందరూ అధికారులు ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు మా సమస్యను అర్థం చేసుకొని రాజకీయాలకతీతంగా, మతాలకతీతంగా, కులాలకు అతీతంగా దళితుల పక్షాన ఉండాలని అని ఆశిస్తున్నాము. సమస్య పరిష్కారం అయ్యే అంతవరకు స్మశాన వాటిక స్థలం దళితులకు కేటాయించే వరకు సర్వే రిపోర్ట్ సమర్పించి రికార్డులలో నమోదు చేసేంతవరకు మేము కార్యక్రమాలను కొనసాగిస్తామని జీవో నెంబర్ 1235 ప్రకారం పూర్తి హక్కులు కల్పిస్తూ స్థలం కేటాయించాలని కోరుతున్నాము. ఈ యొక్క కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మనోహర్ , కొమ్ము శ్రీనివాసరావు మాజీ జెడ్ పి టి సి, ఎంపీపీ, గ్రామ యువత ఇరుగు నరేష్, ఆదూరి గోపి, ముత్తారపు నవీన్, ఇరుగు సురేష్ ఆదూరి నరేష్ ముత్తారపు ప్రేమ్ కుమార్ ఇరుగు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులు పరిశీలించిన సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్



బోనకల్, మే 24 ప్రజా పాలన ప్రతినిధి: మండల పరిధిలోని రావినూతల గ్రామంలో ఉపాధి హామీ పనులును మంగళవారం గ్రామ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలు చేస్తున్న పనులను స్వ యంగా పరిశీలించి వారికి వస్తున్న వేతనం వివరాలు అడిగి తెలుసుకు న్నారు. పనుల నాణ్యతను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కూలీలు ఏండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పనిచేస్తున్న ప్రాంతంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఓఆర్ఎస్, మంచినీళ్ళు, ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉంచుకొని పనులు చేయాలని కోరారు. ఈకార్య క్రమంలో సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ , ఉప సర్పంచ్ బోయినపల్లి కొండలు ,పంచాయతీ కార్యదర్శి జొన్నలగడ్డ అశోక్ ఉపాధి మేట్లు,కులీలు పాల్గొన్నారు.

## రైతు కల్లాల నుండి ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి**



మంచిర్యాల బ్యూరో, మే24, ప్రజాపాలన :రైతు కల్లాల నుండి వరిధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భారతి హొళికేరి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రవాణ అధికారి కిష్టయ్య, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడుచున్నందున కల్లాల నుండి నాణ్యమైన వరిధాన్యంను కొనుగోలు కేంద్రాలకు, అక్కడి నుండి రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు లారీల యజమానులు పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు. ప్రతి రోజు 362 లారీలు ధాన్యం తరలింపులో పాల్గొనాలని, రైసిమిల్లర్లు కేటాయించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో తీసుకోవాలని తెలిపారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా జిల్లాలో వరిధాన్యంను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేసి ధాన్యం తడవకుండా నిల్వ చేస్తూ త్వరితగతిన రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిల్లులకు ధాన్యం తీసుకువచ్చే లారీల నుండి అన్లోడింగ్ను వేగంగా చేసి లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు

| | | | | |
|---|---|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | - | చేవెళ్ల | - | 9849526878 |
| నరోత్తమ్‌రెడ్డి | - | మేడిపల్లి | - | 9346970159 |
| వెంకటచారి | - | మందమర్రి | - | 9440868581 |
| వెంకటస్వామి | - | మంచిర్యాల | - | 9515048103 |
| ఎం. గైబులు | - | వికారాబాద్ | - | 9704570475 |
| టి.రాంబాబు | - | శేర్లింగంపల్లి | - | 6301925113 |
| సత్య కిషోర్ | - | అమీర్‌పేట | - | 6309723472 |
| బోడ మనోహర్ నంద | - | కరీంనగర్ | - | 9492927684 |
| రాజేందర్ ప్రసాద్ | - | ఖమ్మం | - | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | - | మధిర | - | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | - | పాలేరు | - | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | - | మయూర్ సెంటర్ | - | 9160400339 |
| మాలేదు నరేందర్ | - | ఖమ్మం రూరల్ | - | 8074550397 |
| టిఎస్.చక్రవర్తి | - | ఖమ్మం టౌన్ | - | 9948327333 |
| పసుపులేటి ఈశ్వర్‌తేజ | - | మధిర రూరల్ | - | 6305269141 |
| ఆర్.శ్రీనివాస్ | - | ఎర్రుపాలెం మండలం | - | 8501020885 |
| బుక్య.శ్రీను | - | బోనకల్ | - | 8688810293 |
| సి.మల్లేష్ | - | ఇబ్రహీపట్నం | - | 9618028334 |
| సాయికృష్ణ | - | వైరా | - | 9951486635 |
| దుంపాల రాజేష్ | - | మేడ్చల్ | - | 9848236015 |
| వై.నర్సింహులు | - | తాండూరు | - | 7207677049 |
| డి.ప్రవీణ్ కుమార్ | - | కొడంగల్ | - | 9866027635 |
| టి.సురేష్ చారీ | - | ఆసిఫాబాద్ | - | 9000983108 |
| డి.భాస్కర్ | - | బెల్లంపల్లి | - | 9440018863 |
| ఐ.నర్సింహయ్య | - | జన్నారం రూరల్ | - | 9493314399 |
| గొట్టె సురేందర్ | - | మంచిర్యాల టౌన్ | - | 9248528680 |
| కోట శివకుమార్ | - | లక్సిట్టపేట | - | 9849451367 |


## గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న వాడుక రాజగోపాల్

**సంక్షేమం కావాలంటే షర్మిలమ్మ రావాలి**



మధిర రూరల్ మే 24 ప్రజా పాలన ప్రతినిధి తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ కావాలంటే వైయస్ షర్మిలమ్మ ముఖ్యమంత్రి కావాలని వైయస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర పరిశీలకులు వాడుక రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ లోటస్ పాండ్ లో వైయస్సార్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు నియోజకవర్గ ఇన్చార్జిలు పార్టీ అనుబంధ జిల్లా అధ్యక్షులతో వైయస్ షర్మిలమ్మ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్కినేని సుదీర్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల ప్రసాదరావు ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ రాంబాబు నాయక్ జిల్లా మైనార్టీ సెల్ నాయకులు మదార్ సాహెబ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో సంక్షేమం కావాలంటే షర్మిలమ్మ రావాలి అనే నినాదంతో ఇంటింటికి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అనే కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించాలని పార్టీ నాయకులకు ఆమె దిశానిర్దేశం చేశారు. దీనికి సంబంధించిన గోడపత్రికలను వాడుక రాజగోపాల్ ఖమ్మం జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్రెడ్డి హయాంలో రైతులకు రుణమాఫీ చేశారనే విత్తనాలు ధరలు తగ్గించాలని ఫీజు రియంబర్స్మెంట్, 108, 104, ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల నిర్మాణం అర్హులైన వారికి పెన్షన్లు ఇవ్వటం లాంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. అంతేకాకుండా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, మైనార్టీలకు రిజర్వేషన్లు అందించారని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత టిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ భృతి లేదని, ఎనిమిదేళ్లుగా కొత్త పెన్షన్లు ఇవ్వటం లేదని, రుణమాఫీ లేదని, ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కావాలంటే షర్మిలమ్మ రావాలని నినాదాన్ని గ్రామ గ్రామాన మారుమ్రోగే విధంగా నాయకులు కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఇంటింటికి వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## డైవర్షన్ రోడ్డుపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం: సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్



బోనకల్ మే 24 ప్రజా పాలన ప్రతినిధి : మండల కేంద్రంలో గల 118 రైల్వే గేట్ వద్ద నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. బ్రిడ్జి నిర్మాణ పనులు నడుస్తుండడంతో బోనకల్ నుండి ఆళ్లపాడు గోవిందపురం, రాయనపేట తదితర గ్రామాల ప్రజలు ప్రయాణించడానికి వీలుగా రావినూతల గ్రామం నుండి గల డొంక రోడ్డు కు మళ్లించారు.కానీ అదే డొంకరోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం కొనసాగిస్తున్నారు.రాత్రీ వేళల్లో కొంతమంది ప్రయాణీకులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన దాఖలాలు కోకొల్లలు,సదరు రైల్వే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కనీసం గుంతల్లో మరమ్మతులు కూడా చేయించక పోవడంతో ప్రయాణికులు పలురకాల ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు.విషయంపై స్థానిక రావినూతల గ్రామ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ మాట్లాడుతూ రావినూతల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం అదే డొంక రోడ్డు నుంచి వెళ్ళవలసివస్తుందని ప్రస్తుతం ఉన్న డొంక రోడ్డు ట్రాఫిక్ వలన పూర్తిగా పాడైపోయిందనీ వర్షాకాలంలో రైతు సోదరులు తీవ్ర ఇబ్బందులు ఎదుకొనవల్సి వస్తుందని,కాంట్రాక్టర్ కనీసం దారి మళ్లింపు సూచన చిహ్నాలు కూడా పెట్టలేదని తద్వారా ప్రయాణీకులు ఎటు వెళ్ళాలో కూడా తెలియని అయోమయంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఇప్పటికైనా రైల్వే కాంట్రాక్టర్ స్పందించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు.

## 48 కేసులు.. రూ.2.75 కోట్ల మోసం..

హైదరాబాద్, మే 24, :సైబర్ నేరాలపై పోలీసులు ఎంత ప్రచారం చేసినా కొందరిలో మార్పు రావటం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశ, చిన్న మొత్తంలో పొదుపు చేస్తే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని వాట్సాప్‌లలో లింకులు పంపిస్తూ సైబర్ నేరస్తులు అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. సైబర్ నేరస్తుల చేతిలో చిక్కి డబ్బు పోగొట్టుకుంటున్న వాటిలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులే అధికంగా ఉంటున్నాయి. సాధారణ నేరాలతో పోలిస్తే సైబర్ నేరాలు 200 శాతం మేర పెరిగాయి. వృద్ధులు, మహిళలు, పిల్లలు కూడా సైబర్ నేరస్తుల బారిన పడుతున్నారు. మన వ్యక్తిగత సమాచారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు ఇవ్వటమే సైబర్ నేరాలకు ప్రధాన కారణం. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 48 ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితులు రూ.2,75,05,919 సొమ్మును పోగొట్టుకున్నారు. ఈ బాధితుల్లో అత్యధికంగా కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉద్యోగులే ఉన్నారని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

## ఓదేలు వెనుక... రాజానర్సింహ

హైదరాబాద్, మే 24, :తెలంగాణ కాంగ్రెస్‌లో నిత్యం ఏదో ఒక అలక సర్వ సాధారణమైంది. సభలు.. సమావేశాలు ఏది జరిగినా అలకలు.. అసంతృప్తులు తెరపైకి వస్తున్నాయి. గతంతో పోలిస్తే రాష్ట్రంలో పార్టీ పరిస్థితి కాస్త మెరుగైందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్న తరుణంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. ప్రియాంకగాంధీ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే ఓదెలుతోపాటు జడ్పీ ఛైర్‌పర్సన్ అయిన ఓదేలు భార్య భాగ్యలక్ష్మి కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అధికారపార్టీ టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఈ తరహా చేరికలు పార్టీకి పాజిటివ్ సంకేతాలు ఇస్తాయని లెక్కలేసుకున్నారు నాయకులు. అయితే ఓదెలు కుటుంబం చేరిక కాంగ్రెస్‌లో చర్చతోపాటు రచ్చకు దారితీస్తోందట. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు.. డీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న ఆయన భార్య సురేఖ అక్కడ కాంగ్రెస్‌లో కీలకం. అలాంటిది ఓదేలు చేరిక తమకు తెలియలేదని ప్రేమ్‌సాగర్‌రావు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మాట మాత్రమైనా చెప్పలేదని నొచ్చుకున్నట్టు తెలుస్తోంది.ఓదేలు చేరికపై బ్యాక్‌గ్రౌండ్ వర్కు అంతా మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ చేశారట. ఇక్కడో మతలబు ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరాలి అనే దానిపై పంచాయితీలు లేకుండా సీనియర్ నాయకుడు జానారెడ్డి అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేసింది హైకమాండ్. ఆ కమిటీలో జానారెడ్డితోపాటు మరో ఐదుగురు సభ్యులు ఉన్నారు. జిల్లాల వారీగా చేరికలపై పరిశీలన.. అక్కడి నాయకులతో సమన్వయం చేసి పార్టీలో చేర్చుకోవాలనేది ఆ కమిటీ ఉద్దేశం. ఓదేలు విషయంలో అదేమీ జరగలేదట. అయితే టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే వారి గురించి కమిటీ ముందు పెట్టి చర్చిస్తే.. ఈ లోపు రాజకీయంగా ఒత్తిళ్లు పెరిగి చేరికలు ఆగిపోయే ప్రమాదం ఉందనేది కొందరి వాదన.ప్రతీ చేరిక వెనక ఏదో ఒక వ్యూహం ఉంటుంది. కమిటీలో చర్చించిన తర్వాతే కండువా కప్పాలని అనుకుంటే ఇక అంతే సంగతులని మరికొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారట. ఈ విషయాలు పైస్థాయిలోని కాంగ్రెస్ నాయకులకు తెలియంది కాదు. కాకపోతే.. అన్నీ తెలిసి చేరికల కమిటీ వేసి.. అక్కడ ముందుగా చర్చించాలి అనే నిబంధన పెట్టడం ఎందుకనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఓదేలు విషయంలో ప్రేమ్‌సాగర్‌రావుకు సమాచారం లేదు సరే.. చేరికల కమిటీ ఛైర్మన్‌గా ఉన్న జానారెడ్డికైనా తెలుసా అనేది ప్రస్తుతం చర్చ. పెద్దాయనకు కూడా తెలియకపోతే.. చేరికల కోసం కాంగ్రెస్ వేసిన కమిటీని నామ్ కే వాస్తేగా మిగిలిపోతుందా? ఇకపైనా చేరికలు వారికి తెలిసే అవకాశం లేదా? గాంధీభవన్‌లో హాట్ టాపిక్‌గా మారిన ప్రశ్నలివి.ప్రియాంకగాంధీ సమక్షంలో ఓదేలు కుటుంబం కాంగ్రెస్‌లో చేరడంతో.. ఈ అంశంపై పార్టీలో ఎవరూ ఓపెన్‌గా కామెంట్ చేయడం లేదు. కాకపోతే సమాచారం లేదన్న అంశంపై మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు అసంతృప్తితో ఉన్నారట. మరి.. ఈ అసంతృప్తులు భగ్గుమని రోడ్డెక్కకుండా కాంగ్రెస్ పెద్దలు ఏం చేస్తారో చూడాలి.

# నేను పుట్టి పెరిగిన ప్రపంచం..



బిఎస్.రాములు

## ధర్మపురి పయనం

నిజామాంధ్ర మహాసభలతో పాటు, నిజామాంధ్ర చేనేత కష్ట నివారణ సంఘం హకీం వనమాల నారాయణదాసు, కొండా లక్ష్మణ్ బాపూజీ, దుర్గం నర్సింహులు, చేనేత ఉద్యమ పితామహుడు గుంటుక నర్సయ్య పంతులు, ఎక్కల్దేవి లక్ష్మణభాగవతార్ తదితరుల నాయకత్వంలో ముందుకు సాగారు. 1929లో ఆ తర్వాత 20 ఏళ్ళకు 1949లో జగిత్యాలలో చేనేత పద్మశాలి మహాసభలు జరిగాయి. అయినా కాలం మనం అనుకున్నట్టుగా సాగలేదు. పారిశ్రామికోత్పత్తులు పెరిగాయి. కులవృత్తులు గిట్టుబాటు కాకుండా పోయాయి. అలా చేనేత పద్మశాలి కులాలు ఎన్ని రకాలుగా విడిపోయారో, ఎన్ని రంగాల్లోకి విస్తరించారో, ఎలా వలసలు పోయారో 150 యేళ్ళ చరిత్రంతా సాక్ష్యమే. బొంబాయి నిర్మాతల్లో తెలంగాణ వారిదే ప్రధాన పాత్ర. అందులో పద్మశాలీలు సింహభాగమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పూనా, షోలాపూర్, అహ్మద్‌నగర్, భీవండి, జాల్నా, ముంబాయి, తదితర నగరాల్లో స్థిరపడిన పద్మశాలీలు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా, మున్సిపల్ మేయర్లుగా, కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారు. నగరాలకు వలసవెళ్లినవారు కొందరు ఇలా ఎదుగుతూ వచ్చారు. హైదరాబాద్‌లోను, పోచంపల్లి తదితర గ్రామాలనుండి వచ్చి స్థిరపడినవారు అనేక రంగాల్లో వివిధ స్థాయిల్లో జీవితాన్ని గెలుచుకున్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో అలాగే ఉండిపోయిన చేనేత కార్మికులు రోజురోజుకు ప్రతిష్ఠను, ఉపాధిని కోల్పోయారు. ఎవరో కొందరు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడంతో వారి హోదా, గౌరవాలు మధ్య తరగతి స్థాయికి ఎదుగుతూ వచ్చాయి. ఇలాంటి వారి గురించి 'వారసత్వం', 'స్మృతి' (వెనుకట ఏముండె) , 'జీవనయానం', 'బతుకుపయనం', 'మమతలు' వంటి కథలు, నవలల్లో చిత్రించాను. వాటికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొన్ని కుటుంబాల పరిణామాలను దూస రంగయ్య, మిట్టపెల్లి రాజమల్లయ్య, భీమనాతి గంగారాం పట్వారీ, బేతి శ్రీరాములు, మా పెద్ద వియ్యంకుడు రిటైర్ ఇంజనీర్ ఉసికెల శంకరయ్య, మా పెద్ద వియ్యపురాలు హేమలతగారి అన్న రిటైర్డ్ ఇంజనీర్ జనార్ధన్, అమెరికాలో స్థిరపడిన వారి చెల్లెలు, మా వియ్యంకుడు బావగారైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాసరి రాఘవులు, మరో బావ సుప్రసిద్ధ ఫోటోగ్రాఫర్‌గా పేరుగాంచిన కీ॥శే॥ బండి రాజన్‌బాబు, వారి మరో బావ కరీంనగర్ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, బీడీ కార్మిక నేత సి. ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు అంబళ్ల రాజారాం, కడకుంట్ల గంగారాం, ఇటీవల ఎదిగిన మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ ఎల్. రమణ, తదితరులు విభిన్న రంగాల్లో ఎదుగుతూ వచ్చిన తీరు కనపడుతుంది. అలా ధర్మపురి బంధువులను పరిశీలిస్తే... దూస రంగయ్యగారికి మొత్తం ఏడుగురు సంతానం. మొదటి భార్య మొదటి సంతానం దూస లక్ష్మీరాజం, (లచ్చన్న) ఇరిగేషన్ శాఖలో పనిచేసి రిటైర్ అయ్యారు. రెండవ సంతానం సత్తెమ్మ. ఆ కాలంలో వైద్యం సరిగా లేక మేన సంబంధాలు, అవగాహనలో మార్పులు వంటి కారణాలవల్ల విడాకులు, బాలింతలు చనిపోవడం జరిగింది. మగవాళ్లు రెండవ పెళ్లి, మూడవ పెళ్లి కూడా చేసుకునేవారు. మహిళల్లో మాత్రం రెండవ పెళ్లి బాగా తక్కువ. చాలామంది ఒంటరి మహిళగానే జీవితాలు చాలించారు. అలా ఆ కాలంలో దూస రంగయ్య రెండవ పెళ్లి చేసుకున్నారు. రెండవ భార్య గంగమ్మను చేసుకున్న తర్వాత ఐదుగురు సంతానం. దూస సత్యనారాయణ, దూస సరోజన, దూస రాజేశ్వర్, దూస వీరేశం, దూస బుచ్చిరాజం, దూస గంగక్క మేనమామ సుప్రసిద్ధ హెడ్మాస్టర్. జి.ఆర్. నర్సయ్య. జి. ఆర్. నర్సయ్య మా ఇంటిపక్కనే ఉన్నప్పటికీ ధర్మపురిలో గంగక్క ఇంట్లో కిరాయికి ఉన్నప్పుడు మాటల సందర్భంలో మాత్రమే ఆ విషయం తెలిసింది.

***మిట్టపెల్లి రాజమల్లయ్య కుటుంబం:***

మా చిన్నమామ మిట్టపెల్లి రాజమల్లయ్య, చిన్నత్త కస్తూరి ఈశ్వరమ్మ దంపతులకు ఐదుగురు బిడ్డలు, ఇద్దరు కొడుకులు. పెద్ద బిడ్డ గంగమ్మను రాయికల్ సమీపంలోని రామోజీపేటకు చెందిన బొమ్మకంటి నారాయణగారికి ఇచ్చారు. టీచర్‌గా రిటైర్ అయ్యారు. వారు రాయికల్‌లో స్థిరపడ్డారు. పెద్ద కొడుకు విశ్వగంగాధర్ (సాగర్) ఏడున్నర ఏళ్లు విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో రకరకాల పనులు చేసి తిరిగి వచ్చి రాయికల్‌లో టెంట్ హౌజ్, కిరాణా షాపుతో స్థిరపడ్డాడు. వల్లంపల్లికి చెందిన బాలె శారదతో పెళ్లి జరిగింది. బిడ్డ విశాలాక్షిని కోరుట్లలోని అంకం విద్యాసాగర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. గంగమ్మ చిన్నకొడుకు బొమ్మకంటి నరహరి ఆర్థోపెడిక్ డాక్టర్, కోడలు గైనకాలజిస్ట్ భారతి. జగిత్యాలలో గీతా హాస్పిటల్ పేరుతో స్థిరపడ్డారు.

(మిగతాభాగం రేపటి సంచికలో..)

## జంట కార్పొరేషన్లలో వరదనీటి నాలా పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మేయర్లు



మేడిపల్లి, మే 24 (ప్రజాపాలన ప్రతినిధి) :పీర్జాదిగూడ,బోడుప్పల్ జంట మున్సిపల్ కార్పొరేషన్లలో వరద ముంపుకు శాశ్వత పరిష్కారం కొరకు మంత్రి చామకూర మల్లారెడ్డి,మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ సహకారంతో ఎస్ఎన్డిపి ద్వారా రూ.110కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి టెండర్ దక్కించుకున్న గూత్తేదారులు ఇప్పటికే పనులు ప్రారంభించడం జరిగింది.వివిధ కారణాల ద్వారా పనుల్లో జాప్యం జరగడం, మొదలు పెట్టిన పనులు నత్తనడకన సాగుతుండటంతో జంట మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు, కార్పొరేటర్లు గుత్తేదార్ల పై అసహనం వ్యక్తం చేశారు. అందులో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పీర్జాదిగూడ, బోడుప్పల్ జంట మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, సామల బుచ్చి రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో గుత్తేదారునిపై మేయర్లు ఆగ్రహం వ్యక్తం చేయడంతో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా 4 వర్కింగ్ టీంలను ఏర్పాటు చేసిచెంగిచర్ల చింతల చెరువు నుండి, బోడుప్పల్ ఆల్మాస్ కుంట నుండి, పీర్జాదిగూడ చెరువు, పర్వతాపూర్ చెరువు నుండి మూసికి కలిపే విధంగా ఇలా నాలుగు మార్గాలలో పనులు ప్రారంభించి అనుకున్న సమయానికి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.రానున్న వర్షాకాలంలో ప్రజలు గతంలో లాగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవి గౌడ్, మున్సిపల్ కమీషనర్ డా. పి. రామకృష్ణ రావు, ఎస్ఎన్డిపి అధికారులు, నాయకులు జోడిగే కృష్ణ గౌడ్, కొత్త రవి గౌడ్,అలవాల దేవేందర్ గౌడ్, డిఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల జారీకి దరఖాస్తులు ఆహ్వానం

**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీశ్**



మేడిపల్లి, మే 24 (ప్రజాపాలన ప్రతినిధి) : మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో అధికారిక విడుదల ప్రకారం 2022-2024 సంవత్సరానికి అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారికి దరఖాస్తులను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే ఉన్న అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు జూన్ 30వ తేదీతో ముగుస్తుందని అలాగే 2022-2024 సంవత్సరాల్లో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడిటేషన్ కార్డు జారీ చేయబడతాయని తెలిపారు. దీనికి సంబంధించి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తమ సంస్థలకు చెందిన వర్కింగ్ జర్నలిస్ట్ల పేర్ల జాబితాను జూన్ 4వ తేదీ (04-06-2022)లోగా జిల్లా సమాచార , ప్రజాసంబంధాల విభాగానికి తప్పనిసరిగా సమర్పించవలసిందిగా కలెక్టర్ హరీశ్ వివరించారు. దీంతో పాటు స్వతంత్ర వర్గానికి చెందిన జర్నలిస్టులు నేరుగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల పేర్లను జిల్లాల సంబంధిత డీపీఆర్వోకు పంపవచ్చన్నారు. మేనేజ్మెంట్లు తమ పేర్లను పంపిన జర్నలిస్టులు 25.05.2022 నుండి 04.06.2022 వరకు డిపార్ట్మెంట్ వెబ్సైట్ http://ipr.telangana.gov.in ని సందర్శించడం ద్వారా ఆన్లైన్ ద్వారా అక్రిడిటేషన్ కార్డ్ల కోసం తమ దరఖాస్తులను సమర్పించాలని కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు.

## కూరగాయలు హీటెక్కిన టమాటా

**మధిరలో టమాట కేజీ 80 రూపాయలు**



మధిర మే 24 ప్రజా పాలన ప్రతినిధి కూరగాయల ధరలు ఇటీవల కాలంలో భారీగా పెరిగిపోయాయి. మొన్నటి వరకు కేజీ 15 రూపాయల ధర పలికిన కూరగాయలు సైతం భారీగా పెరిగిపోయాయి. రైతు బజార్లో టమాటా, దోసకాయ, వంకాయ, దొండకాయ, బీరకాయ, పొట్లకాయ, బెండకాయ, బీన్స్, తదితర కూరగాయలన్నీ కేజీ 20 నుండి 75 రూపాయల వరకు ధరలు పలుకుతోంది. బయట మార్కెట్లో మరో పది రూపాయలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కూరల్లో అత్యధికంగా వినియోగించే టమాటా ధరలు సైతం ఇటీవల కాలంలో ఆకాశాన్ని అంటుకున్నాయి. టమాటా ధర మొన్నటి వరకు కేజీ 15 రూపాయల ఉంది. ప్రస్తుతం సాధారణ మార్కెట్లో టమాటా కేజీ 80 రూపాయలు ధర పలుకుతోంది. రైతు బజార్లో కేజీ 76 రూపాయలకు అందుబాటులో ఉన్నా నాణ్యమైన టమాటా రైతు బజార్లో అందుబాటులో లేవని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఒకవైపు కూరగాయల ధరలు పెరిగి సామాన్య ప్రజలను చిన్నాభిన్నం చేస్తుండగా మరోవైపు చైనా ఉక్రెయిన్ యుద్ధం పేరుతో వంట నూనెలు పప్పులు ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి రోజు రోజుకి పెరిగిపోతున్న నిత్యావసర ధరలను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

## రైల్వే లైన్ భూసేకరణలో రైతులకు సరిహద్దులు చూపించాలి



బోనకల్ ,మే 24 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని గోవిందా పురం( ఏ) గ్రామంలో మూడవ రైల్వే లైన్ భూసేకరణలో భాగంగా రెవిన్యూ అధికారులు సర్వేర్, ఆర్ ఐ , రైల్వే సివిల్ ఇంజనీర్ రావడం జరిగినది. రైతుల భూములు ఎంత సేకరిస్తుంది రైల్వే భూమి ఎంత ఉన్నదని, రైతులు హద్దులు ఎక్కడ అన్నదని, స్పష్టత లేకపోవడంతో రైతులు ఈ సర్వేను వ్యతిరేకించారు. భూసేకరణలో రైతులకు సరిహద్దులు చూపించాలని రెవెన్యూ అధికారులను రైతులు కోరినారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు, టిఆర్ఎస్ నాయకులు భాగం నాగేశ్వరరావు, షేక్ పకీర్ సాహెబ్, భాగం మధుసూదన రావు, కాంగ్రెస్ నాయకులు భాగం పాపారావు, వడ్డెబోయిన ఉపేంద్ర, వడ్డెబోయిన సతీష్, బూసి పోగు వెంకటి అనేక మంది రైతులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు: ఎస్సై తేజావత్ కవిత

బోనకల్, మే 24 ప్రజాపాలన ప్రతినిధి: బోనకల్ గ్రామానికి చెందిన చేపల మడుగు అరుణ కుమారుడిని అదే గ్రామానికి చెందిన కోయినేని ప్రదీప్,రావుట్ల సత్యనారాయణ, విజయ కుమార్ అనే ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో ధూషిస్తూ చేతులతో ,చెప్పులతో అతని శరీరంపై, కాళ్లపై కొట్టారు. అంతేకాకుండా అతనిని బెదిరించారు. ఈ సంఘటన ఈనెల 19 వ తేదీన సాయంత్రం ఏడు గంటలకు జరగగా, 23వ తేదీన ఫిర్యాదు చేశారు. సంఘటన జరిగినప్పుడు బాధితుడు బ్రిడ్జి కింద కూర్చొని ఆల్కహాల్ తీసుకుంటున్నాడు. అతని మానసిక పరిస్థితి సరిగా లేదు. పైన పేర్కొన్న ముగ్గురిపై క్రైమ్ నెంబర్ 106 బై 22 అండర్ సెక్షన్ 294 %ఎ, 323, 324, 506, తీ/ష 34 అజూఏ%, సెక్షన్ 3 (1) (%తీ) (౦%) ప్రకారం ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయబడింది.

## పదవ తరగతి కేంద్రలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖాధికారి



జన్నారం రూరల్, మే 24, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్, వెంకటేశ్వర్లు తనిఖీ చేశారని మండల విధ్యశాఖ అధికారి అన్నారు, ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ మండల కేంద్రలోని పదవ తరగతి వార్షిక పరీక్షలకు పద్నాలుగు మంది విద్యార్థులు హాజరు కావడం జరుగలేదని తెలిపారు, జిల్లా విద్యాశాఖాధికారి స్థానిక పదవ తరగతి పరీక్ష కేంద్రలను సందర్శించారని చేశారని అయన అన్నారు.

## మంచి ఆత్మీయుడిని కోల్పోయాం





మల్లు భట్టి విక్రమార్కఅందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.పార్టీ కోసం కష్టపడే మంచి నాయకుడిని కోల్పోయాం మల్లు నందిని విక్రమార్క మధిరమే 24 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు సెల్ఫీ నాయుడు మల్లు భట్టి విక్రమార్క దంపతులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులుమహమ్మద్ అలీ కుటుంబాన్ని పరామర్శించిన మల్లు భట్టి విక్రమార్క దంపతులుఇటీవలే అకాల మరణం పొందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు లిషేక్ మహమ్మద్ అలీలి ఇంటికి ఈరోజు శాసనసభ్యులు గౌరవనీయులు లిమల్లు భట్టి విక్రమార్క మరియు వారి సతీమణి లినందిని విక్రమార్ వారింటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. మొహమ్మద్ అలీ కుటుంబసభ్యులతో లిమల్లు భట్టివిక్రమార్కలి మాట్లాడుతూ తనకు అత్యంత ఇష్టమైన వ్యక్తి అని తనకు ఆత్మీయ సోదరుడిగా ఉండేవారన్నారు మోహమ్మద్ అలీ మరణంతో తమ కుటుంబంలో ఓ ఆత్మీయుడిని కోల్పోయినంత బాధ కలుగుతోందని మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మొహమ్మద్ అలీ మరణం కాంగ్రెస్ పార్టీ కి తీరని లోటని పేర్కొన్నారు. మండల,పట్టణ అధ్యక్షులు లిసూరం శెట్టి కిషోర్‌లి లిమిరియాల వెంకటరమణ గుప్తాలి బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు లిచావా వేణులి మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లిదారా బాలరాజులి మున్సిపాలిటీ కౌన్సిలర్ లిమునుగోటి వెంకటేశ్వరరావులి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవిలి పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు లిషేక్ జహంగీర్‌లి పట్టణ %ఱత్‌బఎ% అధ్యక్షుడు షైక్ బాజి, ముస్లిం మత పెద్దలు లిసయ్యద్ రషీద్, పఠాన్ ఆయుబ్,నన్నే సాహెబ్,షైక్ గౌసుద్దీన్ షైక్ షన్నులి మరియు మధిర మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.


## విత్తనాల అందిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త

**రైతులకు సలహాలు ఇస్తున్న శాస్త్రవేత్తలు**
**మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు**
**సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణిదేవి**



మధిర రూరల్ మే 24 ప్రజా పాలన ప్రతినిధి మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాడు రైతులు మేలైన విత్తనాలను నాటి అధిక దిగుబడులను సాధించి ఆర్థిక అభివృద్ధి పొందాలని మదిర వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే రుక్మిణీదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం లో విత్తన మేళ 2022 నిర్వహించారు. ఈ విత్తన మేళాలో మదిర వ్యవసాయ పరిశోధన స్థానంలో రూపొందించిన పెసర, కంది, మినుము విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశోధనా స్థానంలో రూపొందించిన విత్తనాల యొక్క ప్రాముఖ్యత వాటి గుణగణాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వచ్చే వర్షాకాలం సీజన్ లో పంటలకు ఆశించే చీడపీడలు వాటి నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి శాస్త్రవేత్త కె నాగస్వాతి వివరించారు విత్తనం తో పాటు భూమి సారవంతం పెంపొందించడం పాస్పరస్ ను కరిగించే బ్యాక్టీరియా వినియోగంపై డాక్టర్ జి వేణుగోపాల్ రైతులకు అవగాహన కల్పించారు మట్టి నమూనా సేంద్రియ ఎరువుల వినియోగం పై కోరమండల్ కంపెనీ ప్రతినిధి ఏ రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు కోరమండల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళితబంధు తెచ్చిన సంబురం




కోరుట్ల, మే 24 (ప్రజాపాలన ప్రతినిధి): కోరుట్ల నియోజక వర్గంలోని లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ రవి మరియు ఆర్డిఓ వినోద్ కుమార్ తో కలిసి మెట్ పల్లి విఆర్ఎం గార్డెన్స్ లో దళితబంధు యునిట్లను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ మాట్లాడుతు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళితబంధు పథకంతో దళితవాడలు నూతన వ్యాపారవేత్తలను ఆవిష్కరిస్తున్నాయని, సంపద సృష్టికి నిలయాలుగా మారుతున్నాయని నిన్న మొన్నటి దాకా కూలి పని కోసం ఎదురుచూసినవారు ఇప్పుడు తామే మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారని అన్నారు. ఇది దళితబంధు పథకం సాధిస్తున్న అపూర్వ విజయమని దీన్ని దళిత బిడ్డలు సద్వినియోగం చేసుకొవాలని కోరారు.

# స్కూల్ డేస్ నుంచీ అతడంటే ఇష్టం..: రష్మిక!



కర్ణాటకలో జన్మించిన కన్నడ సోయగం రష్మిక మందన్న గురించి ప్రత్యేకమైన పరిచయాలు అవసరం లేదు. శాండిల్వుడ్ చిత్రాలతో సినీ కెరీర్ ను ప్రారంభించిన ఈ బ్యూటీ 'ఛలో' వంటి విజయవంతమైన చిత్రంతో టాలీవుడ్ లోకి గ్రాండ్ గా ఎంట్రీ ఇచ్చింది. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ.. ఆ వెంటనే రౌడీ బాయ్ విజయ్ దేవరకొండతో 'గీత గోవిందం' చేసి కావాల్సినంత క్రేజ్ యూత్ లో సూపర్ ఫాలోయింగ్ ను సొంతం చేసుకుంది.ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. తనదైన టాలెంట్ తో అంచలంచలుగా ఎదుగుతూ స్టార్ హీరోయిన్ గా గుర్తింపు పొందింది. కెరీర్ మొదలెట్టిన ఐదేళ్లలోనే నేషనల్ క్రష్ గా ముద్ర వేయించుకుంది. ప్రస్తుతం సౌత్ సినిమాలతో పాటు నార్త్ లోనూ నటిస్తోన్న రష్మిక.. రీసెంట్ గా ఓ జాతీయ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఆ సందర్భంగా ఆమె వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత విషయాలను సైతం షేర్ చేసుకుంది.ఈ క్రమంలోనే రష్మిక స్కూల్ డేస్ నుంచీ తాను ఇష్టపడుతున్న వ్యక్తి గురించి ఓపెన్ అయింది. ఇంతకీ రష్మిక ఇష్టపడే వ్యక్తి మరెవరో కాదు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి. 'స్కూల్ డేస్ నుంచే విజయ్ దళపతి గారంటే ఎంతో ఇష్టం. ఆయన నా అభిమాన హీరో. భారీ స్టార్డమ్ ఉన్నప్పటికి విజయ్ గారు చాలా నిరాడంబరంగా ఉంటారు. ఆయనలోని సింప్లిసిటీ నన్ను బాగా ఎట్రాక్ట్ చేసింది.ఇక ఆయనతో కలిసి నటించే అవకాశం రాగానే నా ఆనందందానికి అవధులు లేకుండా పోయాయి. ఫస్ట్ డే షూటింగ్ కోసం ఈగర్ గా వెయిట్ చేశా. ఆ రోజు క్లాప్ కొట్టిన తర్వాత విజయ్కు దిష్టి తీసి ఆయన పట్ల నాకున్న అభిమానాన్ని చాటుకున్నా. దిష్టి తీయగానే విజయ్ గారు ఒక్కసారిగా షాక్ అయ్యారు. సెట్లో ఉన్న వారంతా తెగ నవ్వేశారు' అంటూ రష్మిక చెప్పుకొచ్చింది.కాగా విజయ్ దళపతి రష్మిక జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 'దళపతి 66' వర్కింగ్ టైటిల్ తో ఇటీవలె ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్ గా ప్రారంభమైంది.శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై ప్రముఖ బడా నిర్మాత దిల్ రాజు ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో నిర్మించబోతున్నారు. త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ఇక దీంతో పాటు రష్మిక తెలుగులో 'పుష్ప ది రూల్' మలయాళంలో 'సీతారామం' హిందీలో 'మిషన్ మజ్ను' 'గుడ్ బై' చిత్రాల్లో నటిస్తోంది.

## బుక్ మై షో లో కమల్ "విక్రమ్" సెన్సేషనల్ రికార్డు.!




విశ్వ నటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన లేటెస్ట్ మోస్ట్ అవైటెడ్ సినిమా "విక్రమ్". దర్శకుడు లోకేష్ కనగ్ రాజ్ తో తీసిన ఈ సినిమా ఫస్ట్ టీజర్ నుంచే రుణాల్ని హైప్ ని సొంతం చేసుకొని ఇప్పుడు రిలీజ్ కి సిద్ధంగా ఉంది. అయితే ఈ సినిమాలో కమల్ తో పాటుగా మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, ఫహద్ ఫాజిల్ అలాగే మరో విలక్షణ నటుడు సూర్యల సమ్మేళనం కావడంతో ఆడియెన్స్ లో మరిన్ని అంచనాలు నెలకొన్నాయి.అయితే పాన్ ఇండియా లెవెల్లో మంచి అంచనాలు ఉన్న ఈ సినిమాకి హైప్ ఏ లెవెల్లో ఉందో బుక్ మై షో లో ఇంట్రెస్ట్స్ తో ప్రూవ్ అయ్యింది. ఈ సినిమాకి ఏకంగా బుక్ మై షో లో 2 మిలియన్ కి పైగా ఇంట్రెస్ట్ లు నమోదు అయ్యాయి. దీనితో ఈ చిత్రం ఈ సెన్సేషనల్ రికార్డు నమోదు చేసింది. ఇది మన ఇండియన్ సినిమా దగ్గర రెండో అత్యధికం అట. దీనిబట్టి కమల్ అభిమానులు మరియు ఆడియెన్స్ ఈ సినిమా కోసం ఏ లెవెల్లో ఎదురు చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

# 'మేజర్' కు సెన్సార్ సభ్యులు సెల్యూట్..?



వర్సటైల్ హీరో అడివి శేష్ నటించిన తాజా చిత్రం "మేజర్". 26/11 ముంబై ఉగ్రవాద దాడులలో వీరమరణం పొందిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ స్ఫూర్తిదాయకమైన జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. శేష్ కు "మేజర్" అనేది ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్. ఈ ప్రతిష్టాత్మకమైన చిత్రాన్ని యువ హీరో మునుపెన్నడూ లేని విధంగా ప్రమోట్ చేస్తున్నాడు. మరోవైపు ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి.'మేజర్' చిత్రానికి మొత్తం 149 నిమిషాల నిడివితో సెన్సార్ బోర్డ్ 'యూ/ఏ' సర్టిఫికేట్ ను జారీ చేసింది. సినిమాలోని కంటెంట్ మరియు లోతైన భావోద్వేగాలు సెన్సార్ అధికారులను బాగా ఆకట్టుకున్నట్లు తెలుస్తోంది.సినిమా అయిపోయాక సెన్సార్ సభ్యులు స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడమే కాదు.. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ కు సెల్యూట్ కొట్టారట. 'మేజర్' సినిమా ఫస్టాప్ లో సందీప్ వ్యక్తిగత జీవితంలోని విషయాలను చూపించగా.. సెకండాఫ్ ను చాలా ఎమోషనల్ గా తీర్చిదిద్దారని తెలుస్తుంది.మేజర్ కు తన తల్లిదండ్రులతో అనుబంధం మరియు ప్రేయసి ఇషాతో లవ్ సీన్స్ వంటివి ఆడియన్స్ ను మంత్రముగ్ధులను చేస్తాయని అంటున్నారు. అలానే ఇంటెన్స్ యాక్షన్ - హై మూమెంట్స్ మరియు భావోద్వేగానికి గురి చేసే సీన్స్ తో వీక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని చెబుతున్నారు.హై ప్రొడక్షన్ వాల్యూస్ మరియు బ్రిలియంట్ పెర్ఫార్మెన్స్ లు ఈ చిత్రానికి ఇతర ప్రధాన హైలైట్స్ గా నిలవనున్నాయి. అడివి శేష్ మరోసారి తన అద్భుతమైన నటనతో.. నమ్మశక్యం కాని ట్రాన్స్ఫర్మేషన్ తో ఆకట్టుకోబోతున్నారుఇప్పటికే విడుదలైన 'మేజర్' ప్రమోషనల్ కంటెంట్ తో ఈ విషయంలో స్పష్టత వచ్చింది. పాటలు - టీజర్ - ట్రైలర్ కు ఆడియన్స్ నుంచి అనూహ్య స్పందన లభించింది. దేశం కోసం తన ప్రాణాలను అర్పించిన రియల్ హీరో మేజర్ సందీప్ కు ఈ సినిమా పరిపూర్ణ నివాళి అని భావించవచ్చు.'మేజర్' చిత్రానికి శశి కిరణ్ తిక్క దర్శకత్వం వహించగా.. కథ - స్క్రీన్ ప్లే శేష్ అందించాడు. మహేష్ బాబు ఎంటర్టైన్మెంట్ మరియు మూవీస్ తో కలిసి సోనీ పిక్చర్స్ ఫిల్మ్స్ ఇండియా సంస్థ భారీ స్థాయిలో ఈ సినిమాని నిర్మించింది. శ్రీచరణ్ పాకాల సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి వంశీ పచ్చిపులుసు అందించారు. అబ్బూరి రవి డైలాగ్స్ రాసారు.ఇందులో సయీ మంజ్రేకర్ - శోభితా ధూళిపాళ - ప్రకాష్ రాజ్ - రేవతి మరియు మురళీ శర్మ ఇతర పాత్రలు పోషించారు. ఇప్పటికే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న "మేజర్" చిత్రాన్ని జూన్ 3వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. అయితే విడుదలలకు పది రోజుల ముందు నుంచే ఈ సినిమా ప్రివ్యూలు దేశవ్యాప్తంగా నిర్వహించబడతాయి. హైదరాబాద్ ఏఎమ్బీ మాల్ సహా 9 ప్రధాన నగరాల్లో మే 24 నుంచి రోజుకో కేంద్రంలో 'మేజర్' ప్రివ్యూ ప్రదర్శించనున్నారు. హైదరాబాద్ - ఢిల్లీ - లక్నో - జైపూర్ - బెంగళూరు - ముంబై - పూణె - అహ్మదాబాద్ - కొచ్చి వంటి నగరాల్లో ఈ ప్రివ్యూలు ప్రదర్శిస్తారు. ఇందుకోసం మేకర్స్ బుక్ మై షోతో ఒప్పందం కుదుర్చుకున్నారు.ఇలా రిలీజ్ కు అన్ని రోజుల ముందే ప్రివ్యూస్ వేయడం దేశంలోనే తొలిసారి. 'మేజర్' సినిమా మీదున్న నమ్మకంతో మరింత పాపులారిటీ తెచ్చుకునేందుకే ఈ తరహా స్ట్రాటజీని ఫాలో అవుతున్నారని తెలుస్తోంది. తెలుగు హిందీ మలయాళ భాషల్లో సాధారణ టికెట్ రేట్లతో రాబోతున్న ఈ బయోపిక్.. ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# అకీరానందన్ లో హిడెన్ ట్యాలెంట్!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తర్వాత నట వారసత్వాన్ని అకీరానందన్ అందుకోవాల్సి ఉంది. ఇప్పటికే అకీరా ఎంట్రీ పై చిలవలు పలవలుగా మీడియాలో కథనాలు వెలువడుతూనే ఉన్నాయి. మరి అకీరా నటుడిగా ఎంట్రీ ఇస్తాడా? లేదా? అన్నది క్లారిటీ లేదు గానీ అభిమానులు మాత్రం పవన్ వారసుడిగా అకీరాని వెండి తెరపై చూసుకోవాలని ఎంతో ఆశపడుతున్నారు.అకీరా పుట్టిన రోజు వచ్చినా....నాన్న తో కలిసి కనిపించినా అభిమానుల ఆనందానికైతే అవధులు లేవ్. పవన్ తో సమానంగా అకీరాని అభిమానిస్తారు. భార్య భార్తలుగా పవన్ -రేణుదేశాయ్ విడిపోయినా వారసుడిగా మాత్రం అకీరా ఎప్పుడూ ప్రత్యేకమే. తాజాగా అరీరాలో హిడెన్ ట్యాలెంట్ బయట పడింది. నిన్నటితో అకీరాందన్ న్ స్కూల్ గ్రాడ్యుయేషన్ పూర్తయింది.ఈ సందర్భంగా అకీరా స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఇచ్చాడు. 'ఆర్ ఆర్ ఆర్' చిత్రంలో దోస్తీ సాంగ్ ని పియానోపై వాయించి తనలో ఇన్నర్ ట్యాలెంట్ ని బయట పెట్టాడు అకీరా. నిజంగా చాలా చక్కగా పియానో వాయించాడు. మ్యూజిక్ రంగంలోకి దిగితే రాణించగలడ న్న కాన్ఫి డె న్స్ కనిపిస్తుంది. దానికి సంబంధించిన వీడియో ఒకటిప్పుడు నెట్టింట వైరల్ గా మారింది.ఇప్పటివరకూ అకీరాలో ఈ ట్యాలెంట్ ఉందని ఎప్పుడూ బయట పడలేదు. తొలిసారి విషయం బయటకు రావడంతో అకీరా మ్యాకప్ వేసుకోవడానికి బధులుగా మ్యూజిక్ ఇనిస్ట్రుమెంట్స్ పట్టుకుంటాడా? అన్న సందేహం అభిమానుల్లో మొదలైంది. దోస్తీ సాంగ్ వాయిస్తున్న సమయంలో తల్లిదండ్రులు పవన్ కళ్యాణ్- రేణు దేశాయ్ కూడా ఉన్నారు.తనయుడిలో ఈ ప్రతిభని చూసి పాదర్-మదర్ ఎంతో మురిసిపోయారు. కుమారుడు పైకి రావాలని ఆశీర్వదించారు. వేదికపై అకీరా తల్లిదండ్రులతో కలిసి ఫోటోలు దిగాడు. మరి తనయుడ్ని ఇలా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించింది మాత్రం రేణు దేశాయ్ అనే చెప్పాలి. విడిపోయిన తర్వాత పిల్లలు ఇద్దరు తల్లితోనే ఉన్నారు. రేణు పూణే లో స్థిరపడ్డారు. మరాఠి సినిమాలు నిర్మిస్తున్నారు. అక్కడే పిల్లల చదువులు సాగుతున్నాయి. అకీరా నటుడు అవుతాడా? ఇంకేదైనా రంగంలో రాణిస్తాడా? అన్నది అతని ఇష్టంపైనే అధార పడి ఉంటుందని రేణు ఇప్పటికే వెల్లడించారు. మరి అకీరా మనసులో ఏముందో.

# పాన్ ఇండియా లెవెల్లో నిఖిల్ మరో సినిమా




ఏ హీరోని కదిలించినా పాన్ ఇండియా ప్రాజెక్ట్ ముచ్చట్లు చెబుతున్న విషయం తెలిసిందే. బడా హీరోల నుంచి మినిమమ్ గ్యారెంటీ హీరోల వరకు ప్రతీ ఒక్కరూ ఇప్పుడు పాన్ ఇండియా జపం చేస్తున్నారు. అయితే కొంత మంది మాత్రం ప్రాజెక్ట్ డిమాండ్ ని బట్టి పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్స్ చేస్తున్నారు. ఇప్పటికే 'స్పై' సినిమాతో పాన్ ఇండియా మూవీని ప్లాన్ చేసిన యంగ్ టాలెంటెడ్ హీరో నిఖిల్ మరో సినిమాని కూడా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయడానికి రెడీ అవుతున్నట్టుగా తెలుస్తోంది.వివరాల్లోకి వెళితే.. నిఖిల్ హీరోగా నటించిన మూవీ 'కార్తికేయ'. యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ చందూ మొండేటి ఈ మూవీని తెరకెక్కించారు. తొలి ప్రయత్నంలోనే ఈమూవీతో సూపర్ సక్సెస్ ని సొంతం చేసుకున్న ఆయన మళ్లీ ఇన్నాళ్లకు ఈ మూవీకి సీక్వెల్ ని చేస్తున్నారు. నిఖిల్ హీరో గా 'కార్తికేయ' సీక్వెల్ గా 'కార్తికేయ2'ని రూపొందిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తోంది.పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్ పై టి.జి. విశ్వప్రసాద్ అబిషేక్ అగర్వాల్ ఈ మూవీని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్నారు. తొలి పార్ట్ సూపర్ సక్సెస్ కావడంతో దానికి సీక్వెల్ గా రూపొందుతున్న 'కార్తికేయ 2' పై కూడా భారీ అంచనాలున్నాయి. జూలై 22న ఈ మూవీని భారీ స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.అయితే తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయం ఒకటి బయటికి వచ్చింది. చందూ మొండేటి చెప్పిన కథకి మించి ఔట్ పుట్ రావడంతో మేకర్స్ చాలా ఇంప్రెస్ అయ్యారట.ఎలాగైనా ఈ మూవీని హిందీలోనూ రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నట్టుగా తెలుస్తోంది. ఇందులో భాగంగానే హిందీలో డబ్బింగ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా తన పాత్రకు తానే హీరో నిఖిల్ హిందీలో డబ్బింగ్ చెప్పబోతున్నారట.తెలుగు చిత్రాలు బాలీవుడ్ లో భారీ వసూళ్లని రాబడుతున్న నేపథ్యంలో మిస్టరీ థ్రిల్లర్ గా రూపొందుతున్న 'కార్తికేయ 2' కూడా అక్కడ అనూహ్య విజయాన్ని సాధించడం ఖాయం అని ఆ నమ్మకంతోనే ఈ మూవీని హిందీలోనూ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్స్ చేస్తున్నారని తెలిసింది. విఎఫ్ ఎక్స్ ప్రధానంగా సాగే ఈ మూవీ విజువల్స్ పరంగానూ విశేషంగా ఆకట్టుకోవడం ఖాయమని తెలుస్తోంది.

# రామ్ మాస్ ప్లాన్.. లైన్ లోకి పవన్ డైరెక్టర్?



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని ప్రస్తుతం అగ్ర దర్శకులతో కూడా సినిమాలు చేసేందుకు గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ తో ఇస్మార్ట్ శంకర్ సినిమా చేసిన అనంతరం ఈ హీరో తన భవిష్యత్తు ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తూ ఉన్నాడు. ఇస్మార్ట్ శంకర్ తో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న తర్వాత చేయబోయే సినిమాలతో కూడా అదే తరహాలో సక్సెస్ అందుకోవాలని సిద్ధమవుతున్నాడు.ఆ మధ్య చేసిన రెడ్ సినిమా రామ్ ఊహించనంతగా సక్సెస్ కాలేదు. ఇక ప్రస్తుతం తమిళ సీనియర్ దర్శకుడితో ది వారియర్ అనే సినిమా చేస్తున్న రామ్ ఆ సినిమాతో తమిళంలో కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు.ది వారియర్ సినిమా పై చాలా నమ్మకంతో ఉన్న రామ్ పోతినేని ఆ తర్వాత ఫస్ట్ పాన్ ఇండియా సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మాస్ కమర్షియల్ దర్శకుడు బోయపాటి శ్రీను దర్శకత్వంలో మొదటి పాన్ ఇండియా సినిమా చేసేందుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు.ప్రస్తుతం దర్శకుడు బోయపాటి రామ్ పోతినేని కోసం ఫైనల్ స్క్రిప్టు సిద్ధం చేసే పనిలో బిజీగా ఉన్నాడు. అదే విధంగా మరో మాస్ దర్శకుడితో కూడా చర్చలు జరుపుతున్నాడు. ఆ దర్శకుడు మరెవరో కాదు పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ లాంటి విజయం తర్వాత భవదియుడు భగత్ సింగ్ అనే సినిమా చేస్తున్న హరీష్ శంకర్ అని తెలుస్తోంది. దర్శకుడు హరీష్ శంకర్ ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా ప్రయత్నాలు మొదలుపెట్టాడు.అక్కడ సల్మాన్ ఖాన్ తో కూడా సినిమా చేసే అవకాశాలు ఉన్నట్లు ఇటీవల కొన్ని కథనాలు వెలువడ్డాయి. అయితే ప్రస్తుతం సల్మాన్ ఖాన్ చాలా బిజీగా ఉండడంతో ప్రాజెక్టు సెట్ అవ్వడానికి కొంచెం టైం పడుతుంది.ఇక ఇంతలోపు భవదియుడు భగత్ సినిమాలు పూర్తి చేసుకుని హరీష్ శంకర్ రామ్ పోతినేనితో ఒక బిగ్ బడ్జెట్ సినిమాను తెరపైకి తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదివరకే రెండు మూడు సార్లు వీరిద్దరి మధ్య చర్చలు జరిగాయి. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989